

పలమనేరు-కుప్పం రహదారికి మహర్దశ

రూ.1500 కోట్ల ప్రతిపాదనలతో విస్తరణకు డీపీఆర్ తయారీ



కేటిల్ ఫారం వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డునుంచి కుప్పం వెళ్లే రహదారి



పలమనేరు-కుప్పం రహదారిలో వి.కోట సమీపంలో ఉన్న రహదారి

పలమనేరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పలమనేరు-కుప్పం రహదారి దశ మారనుంది. అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాలకు చేరువలో వున్న ఈమార్గం తమిళనాడులోని కృష్ణగిరివరకు వెళ్తోంది. ఇటీవల కుప్పం నియోజకవర్గంలో భారీసంఖ్యలో పరిశ్రమల ఏర్పాటుతోపాటు రామకుప్పం సమీపంలో ఒక విమానాశ్రయం ఏర్పాటుకు కూడా భూ సేకరణ కార్యక్రమాలు ఊపందుకొని తుది దశకు చేరుకుంటున్నాయి. ఈనేపథ్యంలో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనల మేరకు కేంద్రం పలమనేరు నుంచి కుప్పం, కుప్పం నుంచి మన రాష్ట్ర సరిహద్దు వరకు 84 కిలోమీటర్ల మేర ప్రస్తుతమున్న రెండు లేన్ల రహదారిని నాలుగులేన్లకు విస్తరించేందుకు రూ.1500కోట్లుమంజూరు చేసినట్లు తెలిసింది. రహదారి విస్తరణ పనులకేకాక ఈ మొత్తం బైపాస్ రోడ్ల నిర్మాణానికి కావలసిన భూసేకరణకు పరిహారం చెల్లింపుల కోసం, ఫ్లైఓవర్ల నిర్మాణానికి వ్యయం చేస్తారని తెలిసింది. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులు ఈ రహదారి విస్తరణ కోసం డీపీఆర్ కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. డీపీఆర్‌ప్రక్రియ పూర్తికాగానే టెండర్లు పిలిచి పనులను కాంట్రాక్టరుకు అప్పగించనున్నారు. వి.కోట, బైరెడ్డిపల్లె, రాజుపేటరోడ్డు, శాంతిపురం, కుప్పం వద్దకూడా బైపాస్‌రోడ్లు నిర్మించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బైరెడ్డిపల్లె, వి.కోట వద్ద బైపాస్‌రోడ్డు నిర్మాణానికి రూ.100కోట్లు మంజూరు చేశారు. బైరెడ్డిపల్లెలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి కావలసిన భూసేకరణ పూర్తికాగా, వి.కోటలో ప్రజలు అభ్యంతరం చెబుతూ హైకోర్టులో స్టే కూడా తెచ్చినట్లు సమాచారం. రహదారి విస్తరణతో ప్రమాదకర మలుపుల వద్ద జరుగుతున్న ప్రమాదాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని వాహనదారులు ఆశిస్తున్నారు. ఇప్పటికే పలమనేరు సమీపంలో బెంగళూరు నుంచి చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్ హైవే పనులు తుదిదశకు చేరుకుంటున్నాయి. బెంగళూరునుంచి తిరుపతికి రైల్వేలైను ఏర్పాటుచేసే ప్రతిపాదన ఉన్నట్లు చెబుతున్నారు. ఇది వాస్తవరూపం దాలిస్తే పలమనేరువద్ద ఉన్న దాదాపు 700 ఎకరాల పారిశ్రామికవాడలు కూడా అభివృద్ధి చెంది ఇక్కడివారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరగనున్నాయి.

వామ్మో...స్క్రబ్ టైఫస్

ఇప్పటికే 379 కేసుల నమోదు



చిత్తూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు అధిక సంఖ్యలో నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు కారణమైన నల్లిని పోలిన కీటకం ఎక్కువగా కొండ ప్రాంతాల్లోనే కనిపించేదని, ఇప్పుడు అన్ని ప్రాంతాలకూ విస్తరించడంతో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ కీటకం కుడితే నల్లని మచ్చ ఏర్పడడంతో పాటు ఏడు రోజుల వరకు జ్వరం ఉంటుందని, డెంగీ తరహాలోనే తీవ్రమైన కండరాల నొప్పి, తలనొప్పి జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తుతాయంటున్నారు.రోగి లక్షణాలను బట్టి సాధారణ యాంటీబయాటిక్స్‌తో నయమవుతుందని, కొన్ని సార్లు ఐసీయూ చికిత్స అవసరమవుతుందని చెబుతున్నారు.చికిత్స ఆలస్యమైతే అవయవ వైఫల్యానికి దారి తీసి కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

లక్షణాలు

పురుగు కుట్టిన ప్రదేశంలో నల్లగా కాలిన గాయంలా ఏర్పడుతుంది. చిన్నపాటి దద్దుర్లు కనిపిస్తాయి.జ్వరం, దగ్గు, జలుబు, నీరసం, తల, కీళ్లనొప్పులతో బాధపడతారు. ప్లేట్‌లెట్లుతగ్గుతాయి. జాగ్రత్తపడి వైద్యులను సంప్రదించకుంటే తీవ్రమైన జ్వరం, పచ్చకామెర్లు, రక్తం గడ్డకట్టడం, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తుతాయి.మూత్రపిండాలు, మెదడుపై ప్రభావం చూపే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

స్క్రబ్‌టైఫస్ అంటే

స్క్రబ్‌టైఫస్ అనేది ఒక రకమైన జ్వరం. ఇది సోకడానికి కారణమైన కీటకం నల్లిని పోలి వుంటుంది. ముఖ్యంగా గ్రామాల్లో వున్న పొదల్లో, తోటల్లో పశువులు మేసేటప్పుడు వాటికి అంటుకునే స్క్రబ్‌టైఫస్ కీటకం వాటిని కడిగేటప్పుడు మనుషులను కుట్టడంతో జ్వరం బారిన పడుతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే పాతబడిన మంచాలు, బొంతలు, దిండ్లు, పరుపులు, చీకటి, చెత్తాచెదారం ఉన్న ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా జీవించే అవకాశమున్నందున ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. ఇది కుట్టినప్పుడు నల్లని మచ్చ ఏర్పడి.. ఏడురోజుల వరకు జ్వరం ఉంటుంది. పిల్లలపై ఎక్కువగా ప్రభావం చూపుతోందని వైద్యులు చెబుతున్నారు.

చిత్తూరు ప్రాంతంలోనే 149 కేసులు

రాష్ట్రంలోనే స్క్రబ్ టైఫస్ కేసులు అధిక సంఖ్యలో చిత్తూరు జిల్లాలో నమోదయినట్లు వైద్య ఆరోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 550 మందిని పరీక్షిస్తే 379 కేసులు పాజిటివ్ వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి.వీటిలో కూడా చిత్తూరు ప్రాంతంలోనే ఎక్కువగా 149 కేసులు నమోదయినట్లు తెలుస్తోంది. అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన టెస్ట్ కిట్లు, ల్యాబ్ లేకపోవడంతో పరీక్షలు చేయించు కోవాలంటే వేలూరు సీఎంసీకి, లేదా తిరుపతి రుయాస్పత్రికి వెళ్లాల్సిందే.టెస్టు ఫలితాలకు సుమారు 48 గంటల సమయం పడుతోందని అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం శాంపిల్స్ అధికంగా ఉండడంతో రిజల్ట్ రావడానికి వారం పడుతోంది.

కేసులపై కలెక్టర్ ఆరా

జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు అధిక సంఖ్యలో నమోదు కావడంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడారు. ఏ ప్రాంతంలో ఎక్కువగా కేసులున్నాయి, ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

జాగ్రత్తలు

3 రోజులకు పైగా తీవ్రమైన జ్వరం, ఆయాసం, దగ్గు వంటి లక్షణాలుంటే ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలి.చెత్త పేరుకుపోకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంట్లో తేమ లేకుండా పొడి వాతావరనం ఉండేలా చూసుకోవాలి.తడి దుస్తులు ధరించకూడదు. పొలాల్లో పనిచేసే వారు ఏదైనా పురుగు కుట్టినట్లు గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

పంచాయతీల విభజనకు గ్రీన్ సిగ్నల్

● యథాతథంగానే రెవెన్యూ గ్రామాలు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే రీ ఆర్గనైజేషన్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కొత్త పంచాయతీల ఏర్పాటుకు అవరోధంగా ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేసింది. జిల్లాలో ప్రస్తుతం 697 పంచాయతీలున్నాయి.ఆర్థిక స్వయం సమృద్ధి ఉన్న పంచాయతీల్లోని శివారు ప్రాంతాలను కొత్తగా పంచాయతీలుగా ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. ఐదేళ్లుగా ఉన్న నిషేధం తొలగిపోవడంతో కొత్తగా పంచాయతీలు ఏర్పాటు చేసుకోవాలనుకునే వారికి మార్గం సుగమమైంది. కొత్త పంచాయతీలు ఏర్పడిన రెవెన్యూ గ్రామాలు యధావిధిగానే కొనసాగుతాయి. వచ్చే ఏడాది మార్చిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ లోపు కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. మార్పులు, చేర్పులను ఆ మండల పరిధిలో వరకే అనుమతి ఇస్తారు. పంచాయతీలు, వాటి పరిధిలోని గ్రామాలను పక్కమండలాల్లో చేర్చడానికి వీల్లేదు. పాలకవర్గం లేని పంచాయతీల్లో ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి తీర్మానం చేయాలి. ఒక పంచాయతీని రెండుగా చేయడం, ఒక పంచాయతీలో గ్రామాలను మరో పంచాయతీలో కలపడం, రెండు పంచాయతీలను విలీనంచేయడం కోసం పాలకవర్గ సభ్యులు తీర్మానాలు చేయాలి. పంచాయతీలు చేసిన తీర్మానాలను కలెక్టర్ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు అందజేస్తారు. దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది.



జిల్లా గెజిట్‌లో విభజన అంశాల ప్రచురణ

చిత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు కొత్తగా ఏర్పాటు చేయనున్న మదనపల్లె జిల్లాలో కలపడం, బంగారుపాళ్యం మండలం పలమనేరు నుంచి చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లోకి మారడంపై గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రిలిమినరీ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా గెజిట్‌లోనూ ప్రచురించాలని కలెక్టర్లకు సూచించగా, జిల్లా గెజిట్‌లోనూ దీన్ని ప్రచురించారు. నవంబరు 27 నుంచి 30 రోజుల పాటు ఈ రెండు అంశాలపై ప్రజల నుంచి కలెక్టర్ అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆ తర్వాత ఫైనల్ గెజిట్‌ను పబ్లిష్ చేసి, నిర్ణయాల్ని అమలు చేస్తారు.

పీడిత జన బాంధవుడు జ్యోతిరావు

● కలెక్టర్ సుమిత్‌కుమార్



జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

చిత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పీడిత జన బాంధవుడు జ్యోతిరావు పూలే అని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. జ్యోతిరావు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీల చదువుకోవాలనే తలంపుతో ప్రత్యేక స్కూల్‌ను ఏర్పాటు చేసిన సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. ఆయన మార్గం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, డీఆర్వో మోహన్‌కుమార్, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మొదిలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్,డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి షణ్ముగం, నగర బీసీసెల్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ యాదవ్, బీజేపీ నేతలు అట్లూరి శ్రీనివాసులు, చిట్టిబాబు, మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాకు గడువు ఇలా....

చిత్తూరు సెంట్రల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):పంటలకు బీమా వర్తింప చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. నిర్ణీత గడువులోపు మొత్తాలు చెల్లించి బీమా ప్రయోజనం పొందాలని వ్యవసాయశాఖాధికారులు సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన (పీఎంఎఫ్‌బీవై) కింద వరి హెక్టారుకు రూ.1.05 లక్షలు బీమా మొత్తాన్ని నిర్దేశించారు. ఇందులో రైతు వాటాకింద 2శాతం ప్రీమియం మొత్తం హెక్టారుకు రూ.210 టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి డిసెంబరు 31లోపు చెల్లించాలి. వేరుశనగ హెక్టారుకు రూ.75వేలు కాగా రైతు వాటా కింద 2 శాతం రూ.150 మొత్తాన్ని డిసెంబరు 15లోపు చెల్లించాలి. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద టమోటా హెక్టారుకు రూ.63500 గాను రైతు వాటా (5శాతం)గా రూ.3125 ఐఎఫ్ఎఫ్‌సీఓ-టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి డిసెంబరు 15లోపు చెల్లించాలి. మామిడి హెక్టారుకు రూ.87500 కాగా, రైతు వాటా (5 శాతం)గా రూ.4375 వచ్చే జనవరి 3వ తేదీలోపు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లించాలని జిల్లా వ్యవసాయాధికారులు వివరించారు.

ఉగాదికి టిడ్కో గృహప్రవేశాలు

చిత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది నాటికి టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. టిడ్కో గృహాలపై తీసుకున్న నిర్ణయంతో చిత్తూరు నగర వాసులు 2832మందికి సొంతింటి కల నెరవేరనుంది. చిత్తూరు నగరం పూనేపల్లె వద్ద 2019 నాటికే అప్పటి టీడీపీ ప్రభుత్వం 2832 టిడ్కో గృహాల నిర్మాణాన్ని పూర్తి చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్మాణ దశలో ఉన్న 672 గృహాలను రద్దు చేసింది. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా 6288 గృహాలను రద్దు చేసి, డిపాజిట్ చేసినవారికి రూ.37.82 కోట్లను తిరిగి ఇవ్వలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు అప్పగించే ప్రక్రియ చేపట్టింది. టిడ్కో ఇళ్లపై ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ నివేదిక ప్రభుత్వానికి అందింది. మంత్రుల బృందాన్ని ఏర్పాటుచేసి ఈ నివేదికపై సమగ్రంగా చర్చించి ఏవిధంగా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోవాలని శుక్రవారం సీఎం చంద్రబాబు సూచించారు.



చిత్తూరు సమీపంలోని పూనేపల్లె వద్ద వున్న టిడ్కో గృహాల సముదాయం

కేంద్రీయ విద్యాలయకు 8 ఎకరాలు

చిత్తూరు మండలం మంగసముద్రం గ్రామంలో 8.08 ఎకరాల్లోని ప్రభుత్వ భూమిని కేంద్రీయ విద్యాలయకు ఉచితంగా కేటాయించడానికి మంత్రి మండలి ఆమోదం తెలిసింది. ఆ భూమి విలువ సుమారు రూ.2.77 కోట్లుగా అంచనా వేసింది. ఇదిలా ఉండగా, కుప్పంలో నెలకొల్పనున్న కేంద్రీయ విద్యాలయకు ఇప్పటికే భూమిని కేటాయించారు.

పలమనేరు మార్కెట్ కమిటీకి 33 ఎకరాలు

పలమనేరులోని లైవ్‌స్టాక్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన 33 ఎకరాల్ని శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీ చేసేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇప్పటికే దీనికి సంబంధించి మార్కెట్ కమిటీ పరిహారం చెల్లించగా, భూమిని అధికారికంగా అప్పగించే ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ 33 ఎకరాల్లో 'పలమనేరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ'ని అన్ని హంగులతో ఏర్పాటు చేయనున్నారు.

దామినీడులో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 28 ఎకరాలు

తిరుపతి రూరల్ మండలం దామినీడులో స్పోర్ట్స్ కాంప్లెక్సు ఏర్పాటుకు ప్రభుత్వం 28.37ఎకరాల భూమిని శాప్‌కు కేటాయించేందుకు అంగీకరించింది. దామినీడులో 193-8, 193-9 తదితర సర్వే నంబర్లలోని ఈ భూమిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నారు.అందులో భాగంగా జాతీయ ప్రమాణాలతో క్రీడల అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. కాగా ఈ భూములకు ఎకరా రూ. 2.50 కోట్లు చొప్పున కలెక్టర్ వెంకటేశ్వర్ మార్కెట్ విలువ సిఫారసు చేసినప్పటికీ ప్రభుత్వం పూర్తి ఉచితంగా భూములను క్రీడల కోసం కేటాయించింది.

వరి రైతుకు వెన్నుపోటు

నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులు



రైతులు కొన్న విత్తనాల సంచులు

మిరప, వేరుశనగ, పత్తి రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయారని వింటుంటాం. ఇప్పుడా పరిస్థితి వరి రైతులకీ దాపురించింది.తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలంలో బీపీటీ 2752 రకం విత్తనాలు కొని నార్లుపోసి వరి నాటుకున్న రైతులు దారుణంగా మోసపోయామంటూ లబోదిబోమంటున్నారు. విత్తనాలు అమ్మిన దుకాణదారు, వ్యవసాయాధికారులు మాత్రం విచారిస్తాం, కంపెనీ వారిని రప్పిస్తాం, పరిహారం ఇప్పిస్తాం అని తాపీగా సమాధానాలు చెబుతున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

సూళ్లూరుపేటలోని ఒక ప్రైవేటు దుకాణంలో బీపీటీ 2782 (జీలకర మసూరాలో ఒక రకం) విత్తనాలను సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రైతులు కొనుగోలు చేశారు. విత్తనాల సంచులపై అన్నపూర్ణ సీడ్స్, నంద్యాల అని ఉంది. ఇదేమి రకమని అడిగితే, కొత్త రకం విత్తనాలు మంచి పంట వస్తుందని దుకాణ యజమాని చెప్పారని రైతులు అంటున్నారు. ఈ విత్తనాలతో నాట్లు పోసుకున్నారు. నారు పచ్చగా చిక్కగా ఎదిగింది. 30 రోజుల నారుని పెరికి పొలాల్లో నాటుకున్నారు. 20 రోజులకే పైరు వెన్నుతీయడం మొదలైంది. సాధారణంగా 60 రోజులకు కానీ వెన్నురాదు. పైగా వెన్నులోనూ గింజల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ముందుగానే వెన్ను తీసిన పైరులో గింజ గట్టిపడదని, పంట రాదని అర్థమైన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణానికి పరుగులు తీశారు. 'ఎవరికి చెప్పద్దు కంపెనీ వారితో మాట్లాడి ఎకరాకి రూ.2వేలు ఇప్పిస్తా' అని వారు సమాధానపరిచారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లారు. 'పరిశీలిస్తాం.. న్యాయం చేస్తాం' అంటూ వారం రోజులు గడిపేశారని రైతులు చెబుతున్నారు. లక్షలు ఖర్చు చేసి చేసిన సేద్యం అప్పులు మిగిలించిందని ఆవేదన చెందుతున్నారు. సూళ్లూరుపేట మండలంలోని మన్నెముత్తేరి, గంపలకండ్రిగ, పెద్దఉల్లాపడవ, మంగళంపాడు ప్రాంతాల్లో ఈ పరిస్తితి కనిపిస్తోంది. దాదాపు 80 మంది రైతులు 200 ఎకరాలకు పైగా ఈ నకిలీ విత్తనాలతో మోసపోయి తీవ్రంగా నష్టపోయారు. వానలు పడుతూ ఉండడంతో ఇంకా పలు గ్రామాల్లో వరినాట్లు జరుగుతున్నాయి. వీటిలో ఎందరు ఇలా మోసపోయారో తెలియాల్సివుంది.



20 రోజులకే వెన్ను తీసిన వరిపైరు

పరీక్షలు చేయిస్తాం

దుకాణ యజమాని ద్వారా కంపెనీ వారిని పిలిపించి పొలాలను పరిశీలించాం. వెన్నుతీసిన మాట వాస్తవమే. శాస్త్రవేత్తలను పిలిపించి పరీక్షలు చేయిస్తాం. సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చేస్తాం.

- కాంచన, వ్యవసాయ అధికారిణి



అమ్మవారికి తిరువీధి ఉత్సవం

తిరుచానూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి శుక్రవారం సాయంత్రం ఘనంగా తిరువీధి ఉత్సవం జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తికి మధ్యాహ్నం స్నపన తిరుమంజనం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన పద్మావతిదేవిని తిరుచ్చిపై కొలువుదీరి రాత్రి తిరుమాడవీధుల్లో ఊరేగించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణ, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠ స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు

పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా పదిరోజులుగా ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో శనివారం నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

నేడు ఎస్వీయూలో 'అన్వేషణ్'


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలోని సెనేట్ హాలులో శనివారం ఉదయం 10 గంటలకు 'అన్వేషణ్-2025' కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యార్థులకు రీసెర్చ్ పేపర్, పోస్టర్, ఓరల్ ప్రెజెంటేషన్, ఇన్నోవేషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ డీన్ మురళీధర్, కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ తెలిపారు.

సర్వ దర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం

హుండీ ఆదాయం: రూ.4.54 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,548
తలనీలాలు సమర్పించినవారు: 25,781



వెటర్నరీ వర్సిటీ పాలకమండలి ఎప్పటికో?

రెండేళ్లు గడుస్తున్నా నియామకం లేదు ● వీసీ నుంచి అధికారుల వరకు ఇన్‌చార్జులే

తిరుపతిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ వర్సిటీలో రెండేళ్లుగా రెగ్యులర్ పాలకమండలి(ఈసీ)ని నియమించలేదు. గతవైసీపీ ప్రభుత్వ హయాంలో ఈసీసభ్యుల పదవీకాలం ముగిసినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. దీంతో 2023 అక్టోబరు నుంచి వర్సిటీకి పూర్తిస్థాయి పాలకమండలి లేదు. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా డాక్టర్ పద్మనాభరెడ్డిని తిరిగి రెండోదఫా వీసీగా నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో అప్పట్లో కొందరు ప్రొఫెసర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. యూజీసీ నియమ, నిబంధన ప్రకారం చట్టసవరణ(అమెండ్‌మెంట్) చేసి వీసీ నియామక నోటిఫికేషన్‌ని జారీ చేయాలని న్యాయస్థానం తీర్పునివ్వడంతో ఆయన నియామకానికి బ్రేక్‌పడింది. ఆ క్రమంలోనే 2023 డిసెంబరు నెలాఖరులో ఐసీఏఆర్‌కి చెందిన ఓ ఎక్స్‌అఫిషియో సభ్యుడు పదవీవిరమణ చేశారు. అప్పట్నుంచి వర్సిటీకి ఎక్స్‌అఫిషియో, పూర్తిస్థాయి పాలకమండలి(ఫుల్‌బోర్డు), రెగ్యులర్ వీసీని నియమించలేదు. గతనెల 28న వర్సిటీలో 253 టీచింగ్ ఖాళీ పోస్టుల (81బ్యాక్‌లాగ్ ఖాళీలతోపాటు) భర్తీకి అనుమతిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



వీటిని భర్తీ చేయాలంటే బోర్డు అనుమతి తీసుకోవాలి. అయితే వర్సిటీలో ఫుల్‌బోర్డు లేకపోవడం, న్యాయస్థానంలో పలు కేసులు పెండింగ్‌లో ఉండడంతో ఈ పోస్టులను భర్తీ చేస్తారా లేదా అన్న అయోమయంలో అధ్యాపకులున్నారు. ఈనేపథ్యంలో వర్సిటీకి కొత్తపాలకమండలి నియామకం ఎపుపడు ఉంటుందనేది చర్చగా మారింది.

అక్కడందరూ ఇన్‌చార్జులే

వర్సిటీలో వీసీ నుంచి యూనివర్సిటీ ఆఫీసర్ల వరకూ అందరూ ఇన్‌చార్జీలుగానే వ్యవహరిస్తున్నారు. 2024 జూలై 19 నుంచి ప్రొఫెసర్ జేవీరమణ ఇన్‌చార్జి వీసీగా ఉన్నారు. గతనెలలో ముగ్గురు రెగ్యులర్ యూనివర్సిటీ ఆఫీసర్ల మూడేళ్ల పదవీకాలం ముగిసింది. దీంతో ఇప్పుడు వీసీ, రిజిస్ట్రార్, వెటర్నరీసైన్స్ డీన్, డీఆర్, డీఈ, సీవోఈ, కంప్ట్రోలర్, డెయిరీడీన్ పోస్టులలో తాత్కాలికంగా ఇన్‌చార్జులే ఉన్నారు. దీంతో ఉద్యోగుల సర్వీస్‌మేటర్స్, ఫైనాన్షియల్ అప్రూవల్స్ వంటి సమస్యలతో ఉన్నతాధికారవర్గాలు సతమతమవుతున్నారు. నాన్‌టీచింగ్ ఉద్యోగుల, సీఏఎస్ అధ్యాపకుల పదోన్నతులు నిలిచిపోయాయి. రెండు కాన్వొకేషన్లు పెండింగ్‌లో ఉండడంతో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఒరిజనల్ డిగ్రీల కోసం ఎదురు చూస్తున్నారు. తాత్కాలిక ఇన్‌చార్జులైన అధికారులు నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితితో అజమాయిషీ, పర్యవేక్షణ కొరవడి వర్సిటీ పాలనగాడి తప్పుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వందకు చేరిన కోర్టు కేసులు

వర్సిటీకి సంబంధించి వంద కోర్టు కేసుల వరకూ పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. వీటిలో పలువురు ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కేసులే ఎక్కువగా ఉన్నాయని తెలిసింది. గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటివరకు వర్సిటీ ఉన్నతాధికారవర్గాలు, ఉద్యోగుల మధ్య సమన్వయం లేక చిన్నాచితక సమస్యల పరిష్కారానికి కూడా ఉద్యోగులు, బాధితులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

తిరుమలకు పూర్తిగా విద్యుత్ బస్సులు

దశలవారీగా డీజల్, పెట్రోల్ ట్యాక్సీలు, టీటీడీ అద్దెవాహనాల రద్దు ● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో పూర్తిగా విద్యుత్ వాహనాలనే వినియోగంలోకి తీసుకురావడానికి విస్తృత చర్యలు చేపట్టినట్టు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో శుక్రవారం కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, ఆర్టీసీ, టీటీడీ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పవిత్రత, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని పాత డీజిల్, పెట్రోల్ వాహనాల వినియోగాన్ని క్రమంగా రద్దు చేయనున్నట్టు వివరించారు. తొలిగా తిరుపతి, తిరుమల మధ్య పూర్తిగా విద్యుత్ బస్సులు మాత్రమే నడిచే ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. తిరుమలలో నడిచే ట్యాక్సీలు, టీటీడీ అద్దె వాహనాల స్థానంలో విద్యుత్ వాహనాలను దశలవారీగా భర్తీ చేయనున్నట్టు చెప్పారు. త్వరలో జరుగనున్న టీటీడీ బోర్డు సమావేశంలో ఈ అంశంపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ సీనియర్ కన్సల్టెంట్ ప్రతినిధి కునాల్ జోషి వివిధ అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో టీటీడీ డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, వీజీవో సురేంద్ర, ఐటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు నాయుడు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

లింగ వివక్షను రూపుమాపాలి


గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ చైతన్యంతో ముందుకు వచ్చి లింగ వివక్షతను నిర్మూలించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాత్రి అంతర్జాతీయ మహిళలపై హింసవ్యతిరేక దినం సందర్భంగా నయీ చేతన4.0 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నెలరోజులు జెండర్ సమానత్వ ప్రచారంనిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు శోభన్‌బాబు, సుశీలాదేవి, వసంతబాయి, శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ నారావారిపల్లె పెండింగ్‌పనులు పూర్తి చేయాలి

స్వర్ణనారావారిపల్లె అభివృద్ధికి సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి తోపాటు ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రకృతి వ్యవసాయం, అనిమల్ హాస్టల్, సబ్‌స్టేషన్, రంగంపేట స్కూల్ నిర్మాణం, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేసుకోకుంటే కార్డుల రద్దు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంకా ఈకేవైసీ చేసుకోలేదా? అలాగైతే రేషన్ కార్డులు రద్దవుతాయి. ఈ నెలాఖరుకు గడువు ఉంది. జిల్లాలో 5,87,001 కార్డులున్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు 70 వేల వరకు ఈకేవైసీ చేసుకోలేదని తెలిసింది. వీళ్ల ఏ మాత్రం ఈకేవైసీ చేసుకోకుంటే ఈనెలాఖరుకు రేషన్ కార్డులు రద్దయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక, రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా ఉండడానికి ఇప్పటికే క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ కార్డులు పంపిణీ చేసింది. ఇందులోనూ ఇప్పటి వరకు దాదాపు 61,203 కార్డులు సచివాలయ సిబ్బంది వద్దే ఉన్నట్లు సమాచారం.

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేశాం



● జీఎం అమరేంద్ర రెడ్డి

తిరుపతి(సెంట్రల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టెలికం జిల్లా (ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో గడిచిన నాలుగేళ్లలో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా నెట్‌వర్క్‌ను బలోపేతం చేశామని బీఎస్ ఎన్ఎల్ జీఎం సి.అమరేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ జిల్లాలో ఫైబర్ నెట్‌వర్క్ వినియోగ దారులు 30 వేల మందికిపైగా ఉన్నారని తెలిపారు. వారి సేవలకు అంతరాయం లేకుండా నెట్‌వర్క్‌ను సరిదిద్దామని చెప్పారు. కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామన్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా జిల్లాకు మరో 75 టవర్లు వస్తాయని చెప్పారు. దీంతో సెల్‌ఫోన్ల సేవలు మరింత మెరుగుపడతాయన్నారు. చిత్తూరు, మదనపల్లె, పలమనేరు, పీలేరు, పుత్తూరు, వాల్మీకిపురం, పాకాల నుంచి తిరుపతి టెలికం జిల్లా కేంద్రానికి 10జీ స్పెక్ట్రంను 100జీకి పెంచామన్నారు. దీంతో ఇంటర్నెట్ వాడకం 2200 టెరాబైట్ పెరిగిందన్నారు. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరింప జేశామన్నారు.

విశాఖకు గూగుల్ పెద్ద గేమ్ ఛేంజర్

● ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తిరుమల, నవంబరు28(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంకు గూగుల్ సంస్థ రావడంతో పెద్ద గేమ్ చేంజర్‌గా మారబోతోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సినీనటులు శ్రీకాంత్, అశోక్‌తో కలిసి శుక్రవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, గతంలో మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు అద్భుతమైన మార్పులు జరిగాయని గుర్తు చేశారు. సైబరాబాద్ వంటి నగరం ఏర్పాటు కావడంలో మైక్రోసాఫ్ట్ కీలకంగా వ్యవహరించిందన్నారు. ఇదే తరహాలో గూగుల్ రాకతో విశాఖపట్నం కూడా ప్రపంచగుర్తింపు నగరంగా అభివృద్ధి చెందబోతోందన్నారు. రిలయన్స్, టీసీఎస్ వంటి అనేక సంస్థలు విశాఖవైపు చూస్తున్నాయన్నారు. కాగా, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.


శ్రీకాంత్, గంటా శ్రీనివాసరావు, అశోక్ - జస్టిస్ ఏవీ శేషసాయి

జీఎస్టీ ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలి

మెడికల్ డీలర్లను ఆదేశించిన జీఎస్టీ సంయుక్త కమిషనర్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మెడికల్స్‌పై ప్రభుత్వం జీఎస్టీ 2.0 తగ్గించిన ప్రయోజనాన్ని వినియోగదారులకుతప్పనిసరిగా అందించాలని చిత్తూరు డివిజన్ రాష్ట్ర పన్నుల సంయుక్త కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి వ్యాపారులకు స్పష్టం చేవారు. శుక్రవారం ఆయన డ్రగ్స్, మెడికల్ ఏజెన్సీల హోల్‌సేల్ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, రీటైలర్లతో తిరుపతి కమర్షియల్‌టాక్స్ కాంప్లెక్స్‌లో సమావేశమయ్యారు. జీఎస్టీ అమలు ప్రక్రియలో వినియోగదారులకు అందాల్సిన ప్రయోజనాలను అందజేయకుంటే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త జీఎస్టీ రేట్ల అమలుపట్ల ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కంపోజిషన్ పన్ను చెల్లింపుదారులు రెగ్యులర్ కేటగిరీకి మార్చాల్సిన అవసరం, ప్రొఫెషన్ టాక్స్ చెల్లింపు తప్పనిసరి అని, రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని, రిటర్న్‌లను సమయానికి దాఖలు చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరత్న, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సుబ్బరామగుప్త, ప్రతినిధులు నరసింహారెడ్డి, కుమార్, శశి, శివ తదితరులు పాల్గొన్నారు.

కాసులిస్తే కానీ కదలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు!

ఉచితం మాటున డ్రైవర్ల చేతివాటం ● ప్రసూతి ఆస్పత్రిలో బాలింతల అవస్థలు

● పిచ్చాటూరుకు చెందిన ధనలక్ష్మి మూడు రోజుల కిందట ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్నారు. శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ఇంటికి వెళ్లేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని అడగ్గా రూ.3 వేల వరకు డిమాండ్ చేశారు. చివరకు రూ.2 వేలకు బేరం కుదుర్చుకుని వెళ్లారు.

● రైల్వేకోడూరుకు చెందిన రేణుక శుక్రవారం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం కోసం డ్రైవర్‌ను సంప్రదించారు. మీది వేరే జిల్లా వస్తుందని అక్కడ వరకు ఉచితంగా రావడం కుదరదని చెప్పారు. ప్రైవేటు వాహనంలో వెళ్లాలంటే కనీసం రూ. 8 వేలు అడగతారని, రూ.4 వేలు చెల్లిస్తే విడిచిపెడతామని చెప్పడంతో చివరకు రూ.3 వేలకు బేరం కుదుర్చుకొన్నారు.

..ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పుల తర్వాత క్షేమంగా ఇంటికి చేర్చేలా ప్రభుత్వం తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా 29 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రభుత్వం అందించింది. వీటిల్లో 19 తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి కేటాయించారు. ప్రసూతి ఆస్పత్రిలో సగటున రోజుకు 20 మందికి పైగా డిశ్చార్జి అవుతుంటారు. వీరిని ఉచితంగా ఇంటి వద్ద విడిచిపెట్టేందుకు అందుబాటులో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు ముందుగానే బేరాలు కుదుర్చుకుంటున్నారు. ఈ వాహనాలు ఉచితంగా కదా అని ఎవరైనా అడిగితే వాహనాలు మాత్రమే ఉచితమని పెట్రోలు, వాహన శుభ్రత, టోల్‌గేట్లు ఇలా చెల్లించాలని చెప్పి ముందుగానే నగదు వసూళ్లు చేస్తున్నారు. అంత ఇచ్చుకోలేని వారు ఆటోలను, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు షెడ్డులోఉన్నా బేరం కుదరకుంటే తీయడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో ప్రవేటు వాహనాల్లో ఇళ్లకు వెళతున్నారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు పూర్తిగా ఉచితమని, ఎవరైనా డబ్బు అడిగితే ఫిర్యాదు చేయాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ చెప్పారు. ఎవరైనా ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామన్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి


ఆటోలో వెళుతున్న బాలింతలు.. షెడ్డులో ఉన్న తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

వేర్వేరు ప్రాంతాల మధ్య 41 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి):ప్రయాణికుల డిమాండ్ మేరకు 41 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. డిసెంబర్ 1నుంచి మార్చి 30 వరకు (సోమ)చర్లపల్లి-షాలిమార్(07225) 18 ట్రిప్పులు, డిసెంబర్ 2నుంచి మార్చి31 వరకు(మంగళ) షాలిమార్-చర్లపల్లి(07226) 18 ట్రిప్పులు,డిసెంబర్ 2 నుంచి 9వరకు(మంగళ) రామేశ్వరం-తిరుపతి(06080) 2ట్రిప్పులు. డిసెంబర్3నుంచి 10వరకు (బుధ) తిరుపతి - రామేశ్వరం (06079) 2ట్రిప్పులు, నవంబర్29 శనివారం ఛప్రా-ఎంజీఆర్ చెన్నై (05081) మధ్య ప్రత్యేక రైలు నడుస్తుందని తెలిపారు.

భానుప్రకాష్‌రెడ్డికి భారత్ గౌరవ్ అవార్డు



తిరుపతి(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి భారత్ గౌరవ్ అవార్డు లభించింది. ధార్మిక, సమాజ సేవా కార్యక్రమాలు చేసిన వారికి భారత్ గౌరవ్ సంస్థ అవార్డులను ప్రదానం చేస్తుంది. ఈ క్రమంలో 2025వ సంవత్సరానికి భానుప్రకాష్‌రెడ్డిని ఎంపిక చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిన్న జీయర్ స్వామి చేతులమీదుగా ఆయన అవార్డును అందుకున్నారు.

రేపు మ్యారేజ్ మీడియేటర్స్ సదస్సు

తిరుపతి(జీవకోన), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల మ్యారేజ్ మీడియేటర్స్ సమావేశం ఆదివారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు న్యూ సమైక్య మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పట్టాభి రామయ్య తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి 500మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యే ఈ సదస్సులో మ్యారేజ్ మీడియేటర్స్ సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీమోహన్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

కుటుంబ కలహాలతోనే

తిరుమలలో ఆత్మహత్యాయత్నం

● పరిస్థితి విషమం


గణేష్

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం ఆత్మహత్యకు యత్నించిన గణేశ్ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. ఆర్బీ సెంటర్ వద్ద బటన్ కట్టర్‌తో పొట్ట, గొంతు కోసుకుని, కడుపులోని పేగులను సైతం బయటకు లాగి ముక్కలు చేసి కుప్పకూలిపోయాడు. స్విమ్స్‌లో శుక్రవారం ఉదయం స్పృహలోకి వచ్చాడు. చైన్నైకి చెందిన గణేశ్ భార్య ఇందిరకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. కుటుంబ కలహాలతో గణేశ్ 15 రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడు. మానసిక పరిస్థితి కూడా బాగాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఓజిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ గూడూరు కోర్టు న్యాయమూర్తి కె.నాగపవన్ తీర్పు ఇచ్చారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.... నెల్లూరు జిల్లా రాపూరు మండలం వేపినాపి గ్రామానికి చెందిన మోడిబోయిన వెంకటేశ్వర్లు మద్యానికి బానిసై తరచుగా భార్యను కొడుతుండేవాడు. దీంతో ఆమె తన పిల్లలతో కలిసి ఐదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి ఓజిలి మండలం కారూరులో తన తాత ఇనుగుంట శ్రీనివాసులు వద్ద ఉంటోంది. వెంకటేశ్వర్లు తరచూ కారూరుకు వెళ్లి భార్య పిల్లలను పంపమని శ్రీనివాసులతో గొడవపడుతుండేవాడు. ఎంతకీ తన భార్యపిల్లలను పంపకపోవడంతో శ్రీనివాసులును హత్య చేసేందుకు వెంకటేశ్వర్లు పథకం పన్నాడు. 2019 జూన్ 24వ తేదీ రాత్రి 7:30 గంటల సమయంలో కారూరులో ఇంటి బయట నిద్రపోతున్న శ్రీనివాసులును గొడ్డలితో మెడమీద నరికి చంపేశాడు. అప్పటి సీఐ నరసింహారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కోర్టులో నేరం రుజువుకావడంతో నిందితుడు వెంకటేశ్వర్లుకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుందరయ్య యాదవ్ కేసు వాదించారు. నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఓజిలి ఎస్‌ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ మల్లిఖార్జున్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులును జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

సైకిల్‌కు పంక్చర్ వేయలేదని దాడి

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు

తడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌కు పంక్చర్ వేయలేదని దాడి చేయడంతో ఒకరు మృతి చెందగా, మరొక వ్యక్తికి గాయాలయ్యాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన సహమద్ ఆలీ తడ మండలం చేనిగుంటలో కోగిలి రామయ్యకు చెందిన ఖాళీ స్థలంలో పంక్చర్ షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. గురువారం చేనిగుంట దళితవాడకు చెందిన మీజూరు ప్రతాప్ సైకిల్ తీసుకువచ్చి పంక్చర్ వేయాలని కోరాడు. సైకిళ్లకు పంక్చర్ వేయలేనని సహమద్ ఆలీ చెప్పినా వినకుండా గొడవకు దిగాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన స్థల యజమాని రామయ్య సర్దిచెప్పడానికి యత్నించాడు. ఆగ్రహించిన ప్రతాప్ రాయితో సహమద్ ఆలీ, రామయ్యపై దాడిచేసి గాయపరిచాడు. స్థానికులు క్షతగాత్రులను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సహమద్‌ఆలీ(47) శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు అదనపు ఎస్పీ కులశేఖర్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం విల్లిపురానికి చెందిన ముట్టియన్ ఆండీ 2019లో నాగపట్ల ఈస్ట్ బీట్ చామలరేంజ్ పరిధిలో ఎర్రచందనం దుంగలు స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పట్లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి విచారణకు హాజరవుతున్నాడు. ఇదే కేసును ఇటీవల తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు మార్చడంతో విచారణ మొదలైంది. ఇరు వర్గాల వాదనలు విన్నాక నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రభుత్వం తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ, కోర్టు లైజన్ అధికారి, కోర్టు కానిస్టేబుల్ కలిసి సాక్ష్యాధారాలను పటిష్ఠంగా హాజరు పరచి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు.

ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



దిశ సమావేశంలో సమీక్షిస్తున్న ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రత్యేక సమావేశపు మందిరంలో దిశ(జిల్లా అభివృద్ధి సమన్వయ- పర్యవేక్షణ కమిటీ) సమావేశం ఎంపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలందరికీ అర్హులకు వర్తించేలా జిల్లా అధికారులు పనిచేయాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో పేదలకు పొజిషన్ సర్టిఫికెట్‌ను త్వరగా ఇవ్వాలని మండల తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూజిల్లాలో 53,338 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. మౌలిక వసతులు, రోడ్లు, తాగునీటి వసతి ఇబ్బందుల దృష్ట్యా నిర్మాణాలు త్వరగా జరగడం లేదన్నారు. పీఎంఏవై కింద వెనుకబడిన వర్గాలకు రూ. 3929 విలువ కలిగిన సెక్యూరిటీ డిపాజిట్లు, రెండు బర్నర్లు, తొలి వంట గ్యాస్‌రీఫిల్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. జిల్లాలో 107 ఎస్సీ గ్రామాలలో ఆదర్శ యోజన గ్రామాలుగా ఎంపిక చేశామన్నారు. తొలి విడతలో 66 గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు., ఇందుకోసం ప్రతి గ్రామానికి రూ. 20లక్షల చొప్పున జడ్పీ నుంచి నిధులను మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా ఆమోదానంతరం సంక్షేమ అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుతెన్నులపై ఎంపీ సమీక్షించారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కమ్మవారి భవన నిర్మాణానికి విరాళం



చెక్కును అందజేస్తున్న చంద్రప్రకాష్

చిత్తూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో కమ్మవారి భవనం నిర్మాణానికి టీడీపీ జిల్లా సీనియర్ నేత చంద్రప్రకాష్ రూ.7.50 లక్షలు విరాళమిచ్చారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళి మోహన్‌ల చేతుల మీదుగా కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నాయకులు భక్తవత్సలం నాయుడు, వెంకటేష్, మోహన్‌రాజ్, రఘు, శశికర్‌బాబు, చల్లా, శ్రీనివాసులు, రాజేష్, నరేష్, వరలక్ష్మీ పాల్గొన్నారు. చంద్రప్రకాష్‌ను కాణిపాకం బోర్డు ఛైర్మన్, సభ్యులు సన్మానించారు.



35 ఏళ్ల డిమాండ్ మళ్లీ తెరమీదకు వచ్చింది. తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలంటూ బలమైన స్వరం వినిపిస్తోంది. 'బాలాజీ డివిజన్ మన హక్కు' అనే నినాదం హోరెత్తుతోంది. సాధించుకోవడానికి చేతులు కలుపుతున్నారు. విభిన్న రంగాల ప్రజలను చైతన్యపరుస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుప్పాల గిరిధర్ కుమార్ కన్వీనర్‌గా ఎం.వేణుగోపాల రెడ్డి, సూరినేని బుజ్జిబాబు నాయుడు,వైఎస్ బాబు, సి.కృష్ణయ్య తదితరులు సభ్యులుగా బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితిని ఏర్పాటు చేశారు. డివిజన్ అవసరాన్ని వివరిస్తూ సెప్టెంబరు 12న తిరుపతిలో సదస్సు నిర్వహించారు.నవంబర్ 16న తిరుపతిలోని ప్రముఖులతో సన్నాహక సమావేశం జరిగింది. ఎంపీలను, ఎమ్మెల్యేలను కలిసి బాలాజీ డివిజన్ సాధనకు సహకరించమంటూ వినతులు ఇస్తున్నారు. రానున్న రోజుల్లో ఉద్యమరూపం తీసుకోవాలని భావిస్తున్నారు.



తిరుపతి హక్కు

బాలాజీ రైల్వే డివిజన్

● నినాదంగా మారుతున్న డిమాండ్

● ఊపందుకుంటున్న సాధన కార్యక్రమాలు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) జోన్‌లోని గుంతకల్ రైల్వే డివిజన్లో తిరుపతి ఉంది. ఇక్కడికి గుంతకల్లు 320 కిలోమీటర్ల దూరం. కొత్తగా ఏర్పడుతున్న విశాఖపట్టణం జోనల్ కార్యాలయం తిరుపతికి 736 కిమీ దూరంలో ఉంది. ఇందువల్ల పాలనాపరమైన ఇబ్బందులు ఎక్కువ. సంవత్సరానికి రూ250 కోట్ల ఆదాయంగల ఏ1 కేటగిరీ స్టేషన్ ఉన్న తిరుపతి ప్రాంతం తీవ్రంగా నష్టపోతోంది. వివక్షకు గురవుతోంది. రైల్వేల పరంగా అభివృద్ధికి అవకాశం లేకుండా పోతోంది. ఈ కారణాలతో బాలాజీ రైల్వే డివిజన్ ఆలోచన 1990లో పురుడుపోసుకుంది. ఇదొక డిమాండ్‌గా అప్పటి నుంచీ వినిపిస్తూనే ఉంది. 2003లో సాకారం అయ్యే పరిస్థితి కనిపించినా దానిని దారిమళ్లించారు. గుంటూరు డివిజన్ ఏర్పడింది. ఇప్పటికే విజయవాడ డివిజన్‌కేంద్రంగా ఉంది. ఈ రెండు డివిజన్ల మధ్య దూరం 30 కిలోమీటర్లు మాత్రమే. అయినా తిరుపతి ప్రాంతానికి అన్యాయం జరిగింది. బాలాజీ డివిజన్ అన్నది బలమైన రాజకీయ డిమాండ్‌గా మారకపోవడమే ఇందుకు కారణం. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఈ ప్రాంత నాయకులు బాలాజీ డివిజన్ సాధించే దిశగా గట్టి ప్రయత్నాలు చేయలేదు. విశాఖ జోనల్ కార్యాలయంతో పాటూ తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పడితే దక్షిణాంధ్ర అభివృద్ధిపై సమాన దృష్టిని కేంద్రీకరించినట్టు అవుతుంది.

మన కింత నష్టమా!

● తిరుపతి రైల్వే స్టేషన్ ద్వారా వచ్చే వందల కోట్ల ఆదాయంలో అత్యధికం ఇతర డివిజన్‌ల అభివృద్ధికి మళ్లిపోతోంది. ఇందువల్ల తిరుపతి స్టేషన్‌లోనూ, ఈ ప్రాంతోని ఇతర స్టేషన్లలోనూ అవసరమైన ప్లాట్‌ఫారమ్ విస్తరణ, పార్కింగ్, లిఫ్టులు, ప్రయాణీకులకు సౌకర్యాలు వంటి ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయి.

● రైల్వే శాఖ ఇప్పటికే చేపట్టిన తిరుపతి- తిరుచానూరు-చంద్రగిరి అభివృద్ధి ప్రణాళికలు, తిరుపతి -గూడూరు డబుల్ లైన్, తిరుపతి-కాట్పాడి ఎలక్ట్రిఫికేషన్ వంటివి నెమ్మదిగా సాగుతున్నాయి. సొంత డివిజన్ ఉండివుంటే ఇవి వేగంగా పూర్తయ్యేవి.

● ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలు రైల్వేల పరంగా వెనుకపడ్డాయి. కొత్త ప్రాజెక్టులు, అదనపు రైళ్లు, లేదా టూరిస్టు రూట్లు అనుమతించాల్సినప్పుడు తగిన ప్రాధాన్యం లభించడం లేదు.

డివిజన్ వస్తే ఇవీ ప్రయోజనాలు

ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతిని చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలతో అనుసంధానించడానికి విస్తృత రైల్వే నెట్‌వర్క్ ఉంది. ప్రత్యేక డివిజన్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైల్వే వ్యవస్థ బలపడడంతోపాటూ, వాణిజ్యం పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

● డివిజన్ ఏర్పడితే 10వేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుంది. రైల్వే కార్యాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగాలు, కంట్రోల్ రూమ్‌లు, పరిపాలన సిబ్బంది, మెయింటనెన్స్, సెక్యూరిటీ, క్లీనింగ్, సిగ్నలింగ్, కేటరింగ్ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. డివిజన్ ఏర్పడితే స్థానిక ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.రైల్వే డివిజన్ ఉన్న నగరాలలో సగటున 500నుంచి వెయ్యి గెజిటెడ్ మరియు నాన్ గెజిటెడ్ పోస్టులు ఉంటాయి. ఇవన్నీ ఈ ప్రాంతం వారి అవకాశాలను మెరుగుపరుస్తాయి.

● రైల్వే డివిజన్ ఏర్పాటు ఈ ప్రాంతానికి ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది, తద్వారా ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో బాలాజీ డివిజన్ కీలక పాత్ర పోషిస్తుంది.

● రైళ్ల రాకపోకలు పెరుగుతాయి. సరుకు రవాణా నిర్వహణ, సేవల నాణ్యత పెరుగుతుంది.

● ప్రభుత్వ పెట్టుబడులు, రైల్వే మౌలిక సదుపాయాలు స్థానిక వ్యాపారాలను, స్థానికులకు ఉపాధిని పెంచుతాయి.

● కృషపట్నం, రాబోయే రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులకు మెరుగైన కనెక్టివిటీ సౌకర్యం ఏర్పడుతుంది.

● ప్రధాన కార్యాలయం చుట్టూ పౌర మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వే కాలనీలు అభివృద్ధి చెందుతాయి.

● డబ్లింగ్, విద్యుదీకరణ, స్టేషన్ అప్‌గ్రేడేషన్, పర్యాటక హబ్ వంటి కొత్త ప్రాజెక్టులకు అవకాశం ఉంటుంది.

● తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలకు మరిన్ని సదుపాయాలు, వెసులుబాటు వసతులు, ఫ్రైట్ హ్యాండ్లింగ్ సౌకర్యాలు వస్తాయి.

మోర్దానపల్లిలో బాస్కెట్ బాల్ పోటీల సందడి



ఎస్పీ క్రీడోత్సాహం



చిత్తూరు పీసీఆర్, పలమనేరు మదర్ థెరిస్సా బాలుర జట్ల పోటీ



తలపడుతున్న చిత్తూరు పీసీఆర్, మదనపల్లె విజయ భారతి బాలికల జట్లు

యాదమరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):యాదమరి మండల పరిధిలోని మోర్దానపల్లి వద్ద గల పీఈఎస్ పబ్లిక్ పాఠశాల క్రీడా ప్రాంగణం వేదికగా 6వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు పీఈఎస్ విద్యాసంస్థ ఏడు సంవత్సరాలుగా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం పేర్కొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ తుషార్ డూడి బెలూన్లను ఎగురవేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా యన మాట్లాడుతూ "క్రీడలలో ఎంతటి పోటీతత్వం ఉన్నా, వెనుకడుగు వేయకుండా ప్రయత్నం చేస్తే విజయం తప్పకుండా మన సొంతం అవుతుంది" అని పేర్కొన్నారు. బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రెజరర్ టి. చెంగల్రాయ నాయుడు మాట్లాడుతూ క్రీడల్లో నిరంతర అభ్యాసం, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం ఆటలపై శ్రద్ధ పెట్టడం ఎంతైనా అవసరమని క్రీడాకారులకు సూచించారు. మదనపల్లె, కుప్పం, ధర్మవరం, విజయవాడ, పలమనేరు, వాయల్పాడు, గుడివాడ, పేటమిట్ట, బంగారుపాళ్యం, చిత్తూరు ప్రాంతాల నుంచి మొత్తం 41 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. వీటిలో 24 బాలుర జట్లు, 17 బాలికల జట్లు ఉన్నాయి.తొలి రోజు బాలుర విభాగంలో గుడివాడ మాంటిస్సోరి, క్యాంఫోర్డ్ పాఠశాల చిత్తూరు జట్లు ముందంజలో నిలిచాయి. బాలికల విభాగంలో పీఈఎస్ పబ్లిక్ పాఠశాల , బంగారుపాళ్యం జట్లు ముందంజలో నిలిచాయి. శనివారం సెమీ ఫైనల్స్ ఫైనల్స్ ముగిశాక విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం వుంటుంది. డీఎస్పీ సాయినాథ్, వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ ఈశ్వర్, పీఈఎస్ పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, ప్రిన్సిపాల్ వై.వి. కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు కోర్టుకు

కుప్పం టీడీపీ నేతలు

రామకుప్పం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రెండున్నరేళ్ళ క్రితం రామకుప్పం మండలం కొంగనపల్లె పంచాయతీ కొళ్ళుపల్లెలో చంద్రబాబు పర్యటించినప్పుడు జరిగిన సంఘటనలపై నమోదైన కేసుకు సంబంధించి శుక్రవారం కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలు చిత్తూరు జిల్లా కోర్టుకు హాజరయ్యారు. అప్పట్లో విపక్ష నేత హోదాలో చంద్రబాబు సొంత నియోజవర్గంలో పర్యటించారు. ఆయనకు స్వాగతం పలుకుతూ కొళ్ళుపల్లెలో టీడీపీ శ్రేణులు స్వాగత తోరణాలు కట్టారు. అదే సమయంలో వైసీపీ శ్రేణులు తమ పార్టీ తోరణాలు కట్టి కవ్వింపు చర్యలకు పాల్పడ్డాయి. చంద్రబాబు కొంగనపల్లెలో పర్యటిస్తూ కాసేపట్లో కొళ్ళుపల్లె వస్తున్నారనగా టీడీపీ శ్రేణులపై రాళ్ళ వర్షం కురిపించాయి.వైసీపీ శ్రేణులను కట్టడి చేయాల్సిన పోలీసులు కూడా టీడీపీ శ్రేణులనే తరిమికొట్టాయి. ఈ నేపథ్యంలో స్థానిక వైసీపీ కార్యకర్తలతో పాటు, అప్పటి రాళ్ళబూదుగూరు ఎస్ఐ మునస్వామి ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు పీఏ మనోహర్‌లతో పాటు నియోజకవర్గంలోని 14మంది కీలకనేతలపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. వైసీపీ కార్యకర్తలు పెట్టిన కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలు లేక ఇటీవల చిత్తూరు కోర్టులో న్యాయమూర్తి కొట్టేశారు. ఎస్ఐ మునస్వామి ఫిర్యాదుతో నమోదైన హత్యాయత్నం కేసుకు సంబంధించి జిల్లా కోర్టులో విచారణ నడుస్తోంది. శుక్రవారం వాయిదాకు గౌనివారిశ్రీనివాసులు, చంద్రబాబు పీఏ మనోహర్, నేతలు జయశంకర్, వెంకటాచలం, వేలు, లోకేశ్ హాజరయ్యారు. డిసెంబరు 22కు కేసును న్యాయమూర్తి వాయిదా వేశారని వారు తెలిపారు

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సహకారం

● అధికారులకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తగిన సహకారం అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ జిల్లా స్థాయిసమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా వారికి అవసరమైన నైపుణ్యాల పెంపుకు అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు.పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే వారికి త్వరగా భూమి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పీఎంఈజీపీ పథకం కింద అందిన 542 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా రుణాలను మంజూరు చేయాలన్నారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం సూరిబాబు, జెడ్ఎం సుబ్బారావు, ఎల్‌డీఎం హరీష్, ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఆగని గజదాడులు

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజ దాడులు ఆగడంలేదు. దేవళంపేట పంచాయతీలో పది రోజులుగా పంటలపై ఒంటరి ఏనుగు దాడులు చేస్తుండటంతో రైతులకు అపారనష్టం వాటిల్లుతోంది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు గురువారం రాత్రి కొమ్మిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకుంది. గ్రామంలోని మామిడి, అరటిచెట్లను ధ్వంసం చేసింది. బోరు పైపులను విరిచేసింది. అలాగే చిన్నగరి, దిగుమూర్తివారిపల్లి గ్రామాల్లోకి ఒంటరి ఏనుగు చేరుకొని అలసంద, రాగి పంటలను ధ్వంసం చేసింది. మామిడి కొమ్మలను విరిచేసింది. కొబ్బరిచెట్లను కూల్చేసి పశుగ్రాసాన్ని తినేసింది. అక్కడి నుంచి ఒంటరి ఏనుగు వచ్చిన మార్గంలోనే తిరిగి అడవిలోకి చేరుకుంది. శుక్రవారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద ఒంటరి ఏనుగు తిష్ట వేసింది.

పాత కలెక్టరేట్ భవనాల పరిశీలన

చిత్తూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక గిరింపేటలోని పాత కలెక్టరేట్‌ను ఆర్డీవో శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. కొన్ని ప్రభుత్వ శాఖలకు కార్యాలయాలు లేక ఇబ్బంది పడుతున్నారని కలెక్టరుకు అధికారులు ఇటీవల విన్నవించారు. దీంతో ఆయన ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ గదులను కార్యాలయాల కోసం పరిశీలించాలని ఆదేశించారు.ఈక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కులశేఖర్‌లు కలిసి పాత భవనాలను పరిశీలించారు. ప్రస్తుతం ఏఏ శాఖలు నడుస్తున్నాయి? ఎన్ని ఖాళీలు ఉన్నాయి? కార్యాలయాల ఏర్పాటుకు అనువుగా ఉన్న గదుల ఎన్ని తదితర విషయాలను సర్వే చేసి నివేదించాలని అర్బన్ తహసీల్దార్ కార్యాలయ సర్వేయర్‌ను వారు ఆదేశించారు.

మీడియా అక్రిడిటేషన్ గడువు రెండు నెలల పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్‌కార్డుల కాల పరిమితిని జనవరి 31వరకు పొడిగించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మీడియా సంస్థల్లో పనిచేస్తున్న వారు తమ తాజా వివరాలను డీపీఆర్వో కార్యాలయానికి త్వరగా అందజేయాలని సూచించారు.

దేవగుడి సినిమా టీజర్ విడుదల



దేవగుడి చిత్రబృందంతో వేము కళాశాల ఛైర్మన్

పూతలపట్టు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):పి.కొత్తకోట సమీపాన వేము ఇంజినీరింగ్ కళాశాలలో దేవగుడి సినిమా టీజర్‌ను కళాశాల ఛైర్మన్ డాక్టర్ కె. చంద్రశేఖర్ నాయుడు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇందులో హీరోగా అరంగేట్రం చేసిన అభినవ్ శౌర్య మాట్లాడుతూ 15 సంవత్సరాలు కష్టపడి ఈ రంగంలోకి వచ్చానన్నారు. సినిమాను ఆదరించాలని కోరారు. రాయలసీమ నేపథ్యంలో ప్రజలను ఆకట్టుకునేలా చిత్రం ఉంటుందన్నారు. డిసెంబరు 19న ప్రేక్షకుల మధ్యకు రాబోతున్న సినిమాలో భీమవరానికి చెందిన అనుశ్రీ హీరోయిన్‌గా నటించారన్నారు. సినీ హీరోయిన్ అనుశ్రీ స్టేజీమీద మాట్లాడుతుండగా, విద్యార్థులు కేరింతలతో సందడి చేశారు. కార్యక్రమంలో దర్శక నిర్మాత బెల్లం రామక్రిష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిలారితో పాటు సినీబృందం, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరులో పిచ్చికుక్క వీరంగం

8 మందికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ఓ పిచ్చికుక్క వీరంగం సృష్టించి 8 మందిని గాయపరిచిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలిలా... పట్టణంలోని నక్కబండ, తూర్పుమొగసాల ప్రాంతాలకు చెందిన జబీవుల్లా(25),గంగాధర్(38), చలపతి(58), నానబాలవీధికి చెందిన పునీత్(9), మహేశ్‌కుమార్(20), అయాన్ (10), కుమారి(23)లపై దాడి చేసి గాయపరచడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మళ్లీ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఆనంద రెడ్డి

రేణిగుంట నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఆనంద్ రెడ్డి కోర్టు స్టేతో మళ్లీ విధుల్లో చేరారు. రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఇటీవల ఆయన్ను సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఆనందరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వులతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఆనందరెడ్డి విధుల్లోకి హాజరయ్యేందుకు అనుమతులు జారీ చేశారు.ఇన్‌చార్జి డీఐజీ మునిశంకరయ్య ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం మళ్లీ బాధ్యతలు స్వీకరించారు.

పౌష్టికాహార పంపిణీలో

అవకతవకలు సహించను

● కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గర్భవతులు, పిల్లలు, బాలింతలకు పంపిణీ చేసే పౌష్టికాహారంలో ఎలాంటి అవినీతి అక్రమాలు, అవకతవకలు జరగకూడదని, అలా జరిగితే సంబంధిత సీడీపీవో, సూపర్‌వైజర్లదే బాధ్యత అని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్స్(కేపీఐ)పై సీడీపీవోలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కేంద్రాలలో ఏదైనా రిపేర్లు ఉంటే నివేదికలు తయారు చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ పనులను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ లక్ష్యాన్ని వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు, జిల్లాలో ప్రతి సీడీపీవో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి క్షేత్రస్థాయి రిపోర్టును తయారు చేయాలని, ముఖ్యంగా పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్ర పరిధిలోఒక వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి.. పిల్లలకు సంబంధించి వీడియోలను అందులో పోస్ట్ చేయాలన్నారు. శనివారం కుప్పం, ఐరాల, జీడీ నెల్లూరు, బైరెడ్డిపల్లె ప్రాజెక్టు పరిధిలోని సీడీపీవోలతో టెలీకాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పీడీ వెంకటేశ్వరి, 12 ప్రాజెక్టుల సీడీపీవోలు పాల్గొన్నారు.

వన్యప్రాణుల గణనపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో సీసీఎఫ్ యశోదా బాయ్

పలమనేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సమీపంలోని మొసలిమడుగు ఎలిఫెంట్ క్యాంప్ ఆవరణలో శుక్రవారం చిత్తూరు, అనంతపురం, సత్యసాయి డివిజన్‌లకు సంబంధించిన జిల్లా అధికారులు, రేంజర్లు, బీట్ ఆఫీసర్లకు వన్యప్రాణుల వివరాల సేకరణపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ యశోదాబాయ్ మాట్లాడుతూ అటవీప్రాంతంలోని వన్యప్రాణుల వివరాల సేకరణ కోసమే బీట్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. అడవుల్లో ఉన్న పులుల వివరాల సేకరణతో పాటు అన్ని వన్యప్రాణుల వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. డిసెంబరు 1 నుంచి 8వ తేదీ వరకు జరిగే వన్యప్రాణుల గణాంకాలపై ఆల్‌ఇండియా టైగర్ ఎస్టిమేషన్-2026 కు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. సత్యసాయి డీఎఫ్‌వో చక్రపాణి, చిత్తూరు డీఎఫ్‌వో శ్రీనివాసులు, పలమనేరు సబ్‌డీఎఫ్‌వో వేణుగోపాల్, పలమనేరు ఎఫ్ఆర్‌వో నారాయణతో పాటు ఇతర రేంజి అధికారులు బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో ఓజేటీ పర్యవేక్షణ



పరిశీలకుడిని సత్కరిస్తున్న అధ్యాపక బృందం

కుప్పం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం, శాంతిపురంలలోని ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఇంటర్ ఒకేషనల్ కోర్సుల ఓజేటీ కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్ర పరిశీలకుడు ఎస్.మోహన్ కుమార్ పర్యవేక్షించారు. విద్యార్థులకు ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు, అధ్యాపకులకు తగు సూచనలు చేశారు. అనంతరం రాష్ట్ర పరిశీలకుడిని అధ్యాపక బృందం సత్కరించింది. కార్యక్రమంలో కుప్పం ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిస్వరణ్, ఏజీఎంవో జగదీశ్‌బాబు, జిల్లా పరిశీలకుడు రెడ్డి నాయక్, ప్రసాద్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాడైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



పాడైన రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న కౌన్సిలర్ దాము

కుప్పం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని కోర్టు కూడలి ప్రాంతంలో రోడ్డు పాడైపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు కౌన్సిలర్ జిమ్ దాము దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన వెంటనే స్పందించి పాడైన రోడ్డుకు మున్సిపల్ సిబ్బందితో శుక్రవారం మరమ్మతులు చేయించారు.

రూ.10 లక్షలతో అత్తికుప్పంలో సిమెంటు రోడ్డు పనులు



అత్తికుప్పంలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న జ్ఞానశేఖర్‌రెడ్డి

రామకుప్పం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం అత్తికుప్పం గ్రామంలో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నట్లు ఐటీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానశేఖర్‌రెడ్డి, ఆత్మా మాజీ డైరెక్టరు రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం అత్తికుప్పంలో వారు సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. చంద్రబాబు సీఎం అయ్యాక గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నేతలు శ్రీరాములురెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, బాలకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రక్త పరీక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



అత్తికుప్పంలో రక్తపరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న జ్ఞానశేఖర్‌రెడ్డి

రామకుప్పం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతంగా జీవించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని.. ఇందుకు గ్రామాల్లో చేపడుతున్న ఉచిత రక్త పరీక్ష శిబిరాలను ఐటీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానశేఖర్‌రెడ్డి, ఆత్మా మాజీ డైరెక్టరు రామలింగారెడ్డి కోరారు. శుక్రవారం వారు రామకుప్పం మండలం అత్తికుప్పంలో సంజీవని పథకం ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత రక్తపరీక్ష శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంజీవని పథకంలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పట్టు రైతులకు పరికరాల పంపిణీ



రైతులకు పనిముట్టు అందజేస్తున్న విశ్వనాథనాయుడు

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలంలో పలువురు పట్టురైతులకు ప్రభుత్వం రాయితీ ధరలకు అందించిన పనిముట్లను శుక్రవారం లేబర్ వెల్ఫేర్ రాష్ట్ర డైరెక్టరు విశ్వనాథనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగంఉదయ్‌కుమార్ రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విండో చైర్మన్ గోపాల్, నేతలు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చంద్రశేఖర్, సిరికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మంగళంపేట ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న అధికారులు

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి మహమ్మద్ షఫీ తెలిపారు. చిత్తూరు తూర్పు రేంజ్ మంగళంపేట అటవీ సెక్షన్ పరిధిలో శుక్రవారం కార్తీక వనసమారాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లతో మానవుడికి తగినంత ఆక్సిజన్ లభిస్తుందన్నారు. మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో తలపడుతున్న మహిళా టీచర్లు

రొంపిచెర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని మహిళా ఉపాధ్యాయులకు రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం క్రీడా పోటీలు నిర్వహి స్తున్నామని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే మహిళా ఉపాధ్యాయులకు క్రీడలపై అవగాహన ఉండాలన్నారు. గత నెలలో మండల స్థాయిలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి నిఖిల్ మాక్ అసెంబ్లీకి పంపడం జరిగిందన్నారు. శుక్రవారం మహిళా టీచర్లకు త్రోబాల్, క్రికెట్ ఆటల పోటీలు జరిగాయి. విజేతలు నియోజకవర్గ క్రీడలకు వెళ్లతారని ఆయన తెలిపారు.

మదనపల్లెను అబ్దుల్ కలాం జిల్లాగా ప్రకటించాలి



మాట్లాడుతున్న ట్రస్టు చైర్మన్ అయూబ్‌ఖాన్

పుంగనూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటు కానున్న మదనపల్లె జిల్లాకు ఏపీజే అబ్దుల్ కలాం పేరు పెట్టాలని పుంగనూరు అబ్దుల్‌కలాం హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి.అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మినీ బైపాస్‌రోడ్డులోని అబ్దుల్‌కలాం సర్కిల్‌లో ఆయన మాట్లాడుతూ మదనపల్లె జిల్లాకు పేరు మార్పు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ఏర్పాటుకు సహకరించిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి.నరసింహులు, నాగరాజు, నానబాల కుమార్, రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ మృతికి సంతాపం

రామకుప్పం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం గట్టూరుతండా పంచాయతీ సర్పంచి మోతియమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్సీ భరత్, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైసీపీ నేతలు విజలాపురం బాబు, చంద్రారెడ్డి, మోహన్‌నాయక్, రవినాయక్, యశ్వంత్ రెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పుంగనూరులో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

పుంగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలని చిత్తూరు కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఎస్‌డీపీఐ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుంగనూరు, పలమనేరు ప్రభుత్వాస్పత్రుల్లో బ్లడ్‌బ్యాంకు లేకపోవడంతో గర్భిణులు, రక్తహీనత కలిగిన వ్యక్తులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఎంతో మందికి ప్రాణాలు పోతున్నాయని, రెండు ప్రాంతాల్లో బ్లడ్‌బ్యాంకులు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఎస్‌డీపీఐ నాయకులు యూసఫ్, రోషన్, జమీర్, కరీం, ఆసీఫ్, ముబారక్, మహబూబ్ పాల్గొన్నారు.

పుంగనూరు డిప్యూటీ ఎంపీడీవోగా సుధాకర్‌రావు



నియామక పత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ ఎంపీడీవోగా సుధాకర్‌రావు

పుంగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు డిప్యూటీ ఎంపీడీవోగా గంగవరం పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రావుకు పదోన్నతి రావడంతో ఆయన శుక్రవారం ఎంపీడీవో అప్పాజీకి నియామక పత్రాన్ని అందజేశారు. మండలంలో పంచాయతీరాజ్‌కు సంబంధించి డిప్యూటీ ఎంపీడీవోగా నారాయణ పనిచేస్తుండగా, సచివాలయాలకు సంబంధించి (జీఎస్‌డబ్ల్యూ) డిప్యూటీ ఎంపీడీవోగా సుధాకర్‌రావు వ్యవహరిస్తారని ఎంపీడీవో పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన మాట్లాడుతూ మండలంలోని సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు కాలంచెల్లిన చిక్కీల పంపిణీ

పుంగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన చిక్కీలను విద్యార్థులకు పంపిణీ చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పుంగనూరు మండలం వనమలదిన్నె జడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలకు భోజనం తర్వాత పౌష్టికాహారం కింద కాలం చెల్లిన బెల్లం చెక్కీలు పంపిణీ చేశారు. కాగా చెక్కీలు ఈఏడాది అక్టోబరు 31వ తేదీకి కాలం చెల్లుతాయని తయారీదారులు ప్యాకెట్‌లో పొందుపరిచారు. ఇది గమనించిన విద్యార్థులు వాటిని తినకుండా ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులకు చూపడంతో ఆందోళనలో పడ్డారు. కాలం చెల్లిన పౌష్టికాహారాన్ని తిని పిల్లలు అస్వస్థతకు గురైతే పరిస్థితి ఏంటని ఉపాధ్యాయులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలం చెల్లిన ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజ లు నిర్వహించారు. అమ్మ వారికి ప్రీతికరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

నవధాన్యాల అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రైవేటు బస్టాండు వద్ద వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్యాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే శుక్రవారం రాహుకాలం సందర్భంగా స్థానిక తూర్పుమొగసాలలో వెలసిన చాముండేశ్వరీదేవి, సుగుటూరు గంగమ్మ, తాటిమాను గంగమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కోనేరు వద్ద వెలసిన అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణదేవికి ప్రత్యేక పూజలు, నిర్వహించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కంగుంది పొలాల్లో రైతులకు సీఎం సందేశపత్రాలు అందజేస్తున్న రాజగోపాల్ తదితరులు

కుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ కుప్పం మండలాధ్యక్షుడు ఎం.రాజగోపాల్ అన్నారు. కుప్పం మండలం కంగుంది పంచాయతీలో రైతన్నా - మీకోసం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి సందేశ పత్రాన్ని అందజేశారు. అలాగే పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతుల వద్దకు వెళ్లి వారికి సందేశ పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతులకు పంట కోసం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రెండు విడతలుగా ఆర్థిక సాయం అందజేసిన విషయం గుర్తు చేశారు. రైతులు అప్పులపాలు కాకుండా ఈ సాయం అందించిందన్నారు. మండల వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పలు వ్యవసాయ పథకాల గురించి వివరించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి హైదరవలి, యూనిట్ ఇన్‌చార్జి దివాకర్, సర్పంచి ధనశేఖర్, పశువైద్యాధికారి కోదండప్ప, కో క్లస్టర్ ఇన్‌చార్జి గాయత్రి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లోకేశ్, మైనారిటీ సెల్ నాయకులు అబ్దుల్ మునాఫ్, అక్మల్, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు షరీఫ్ పాల్గొన్నారు.

● **కుప్పం రూరల్:** ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వినియోగించుకోవాలని కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజగోపాల్, కడా పీఏసీ సభ్యుడు రామచంద్ర కోరారు. దాసేగౌనూరు పంచాయతీ బొగ్గుపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన రైతన్నా - మీకోసం జరిగింది. ఏవో ఫయాజ్ బాషా, నాయకులు వెంకటాచలం గౌడ్, అశోక్, సెరికల్చర్ ఏడీ మోహన్‌బాబు, వెటర్నరీ అధికారి కోదండప్ప, రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు పంచాయతీ పరిధిలోని బందార్లపల్లెలో రైతన్నా-మీకోసం చేపట్టారు. వ్యవసాయ సహాయకులు మనోజ్‌కుమార్, నేతలు లక్ష్మీనారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● **సోమల:** ఆరోగ్య సంరక్షణకు ప్రకృతి వ్యవసాయం వైపు రైతన్న మొగ్గ చూపాలని జిల్లా పట్టుపరిశ్రమ అధికారి పద్మ తెలిపారు. శుక్రవారం సోమల మండలంలోని ఇరికిపెంట, ఎస్.నడింపల్లె పంచాయతీల్లో జరుగుతున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని అధికారులు తనిఖీ చేశారు. ఏడీఏ శివకుమార్ రాజు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, ఏవో సుధాకర్, పశువైద్యాధికారి చందనప్రియ, నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, చంద్రశేఖర్ నాయుడు, వనజ, శ్రీకాంత్ రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సంగీతంలోనూ రాణించాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో రోటరీక్లబ్ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు విద్యార్థులు చిన్నతనం నుంచే సంగీతం, నాట్యాన్ని నేర్చుకుని రాణించాలని పుంగనూరు రోటరీక్లబ్ ప్రతినిధులు డాక్టర్లు ప్రభాకర్, విజయకుమారి సూచించారు. శుక్రవారం స్థానిక ఎల్‌ఐసీ కాలనీలోని జేఎస్ కల్చరల్ అకాడమి వార్షికోత్సవం సందర్భంగా నేర్చుకున్న కళలను పలువురు విద్యార్థులు ప్రదర్శించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు నానబాల గణేశ్ మాట్లాడుతూ పిల్లలకు గత నాలుగేళ్లుగా జేఎస్ కల్చరల్ అకాడమి నిర్వాహకులు డాక్టర్ జాన్, స్వప్న, బాలాజీ, ఆనంద్‌బెన్‌లు సుమారు 75మంది విద్యార్థులకు కీబోర్డు, గిటార్‌తో పాటు నాట్యం నేర్పించడం అభినందనీయమన్నారు. గత నెల తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన నృత్య పోటీల్లో 14 మంది విద్యార్థినులు ప్రతిభకనబరిచి బహుమతులు సాధించడంతో పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో విజేతలను అభినందిస్తూ శాలువలుతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెనిద్రతో ప్రజలకు మరింత భరోసా



వడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పల్లెనిద్రతో ప్రజలకు మరింత భరోసా కల్పిస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పులిచెర్ల మండలం మతుకువారిపల్లి పంచాయతీ వడ్డిపల్లిలో శుక్రవారం రాత్రి కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. రామమందిరం వద్ద గ్రామస్తులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలు కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

బైరెడ్డిపల్లె చెరువుకు జలహారతి



బైరెడ్డిపల్లె చెరువువద్ద పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె చెరువువద్ద శుక్రవారం సాయంత్రం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు హంద్రీ-నీవా జలాలతో చెరువు నిండిపోయి జలకళ సంతరించుకోవడంతో శేషాద్రిస్వామి ఆలయ అర్చకులు తిప్పయ్యాచార్యులు జలహారతినిచ్చి పూజలు చేశారు. బైరెడ్డిపల్లె చెరువునిండి కళకళలాడుతుండటంతో ఆయకట్టు రైతులు, స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, మాజీ జడ్పీటీసీ రాధమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పలమనేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు డిపో నుంచి రానున్న డిసెంబరు 3న కార్తీక దీపం, డిసెంబరు 4న పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 3న మధ్యాహ్నం పలమనేరులో 2 గంటలకు బయలుదేరి తిరువణ్ణామలైకు రాత్రి 8 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి అక్కడ ఉదయం 2 గంటలకు బయలు దేరి పలమనేరుకు 6 గంటలకు చేరుతుందన్నారు. అలాగే డిసెంబరు 4న పౌర్ణమి రోజు ఉదయం 11 గంటలకు, 11.15 గంటలకు రెండు బస్సులు పలమనేరు నుంచి తిరువణ్ణామలైకు బయలుదేరి అదేరోజు తిరువణ్ణామలైకు మధ్యాహ్నం 3గంటలకు చేరుకుంటాయని తెలిపారు. తిరిగి తిరువణ్ణామలై నుంచి అదేరోజు రాత్రి 11 గంటలకు 11.15 గంటలకు బయలు దేరి మరుసటి రోజు 5న ఉదయం పలమనేరుకు 3 గంటలకు, 3.15 గంటలకు చేరుకుంటాయన్నారు. ఒక్కొక్కరికి పలమనేరు నుంచి తిరువణ్ణామలైకు వెళ్లిరాను రూ. 520 లు ఛార్జి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ అల్తాఫ్ కోరారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా పూలే



పుంగనూరు: మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు



కుప్పంలో పూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావ్ పూలే అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జ్యోతిరావ్ పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాలు, ఇతర అణగారిన వర్గాల కోసం శాంతియుత మార్గంలో పోరాడి వారి హక్కులు సాధించి కాపాడిన సామాజిక సంస్కర్తగా పూలేను అభివర్ణించారు. మహిళా సాధికారత, విద్యా బోధన వంటి పనులతో కార్యక్షేత్రంలో క్షేత్ర స్థాయిలో నిలబడి అందరివాడుగా నిలబడ్డారన్నారు. అందుకే నేడు కేవలం అణగారిన వర్గాలకే కాక, అందరికీ దైవ సమానుడయ్యారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వం, కడా పీఏసీ సభ్యుడు రాజ్‌కుమార్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, కౌన్సిలర్ సోము, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, మంజునాథ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● రెస్కో కార్యాలయంలో: కుప్పం పట్టణంలోని రెస్కో కార్యాలయంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రెస్కో డైరెక్టర్ ఎస్‌ఎస్.తులసీనాథ్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే వర్ధంతిని జరుపుకున్నారు. కార్యక్రమంలో రెస్కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● రామకుప్పం: అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే వర్ధంతిని రామకుప్పం టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నేతలు పూలే చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కామరాజనాయక్, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, అంజనేయరెడ్డి, కడా పీఏసీ సభ్యుడు రఘు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, రెస్కో డైరెక్టరు మనోహర్, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, నేతలు పాల్గొన్నారు.

● శాంతిపురం: మహాత్మా జ్యోతీరావుపూలే వర్ధంతిని శాంతిపురం టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్ రాష్ట్ర డైరెక్టరు విశ్వనాథనాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు నందిగం ఉదయ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జిలు రాజేంద్రప్రసాద్, నాగరాజు, విండో చైర్మన్ గోపాల్, నేతలు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

●రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మాజ్యోతిరావ్‌పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మార్పీస్ మండలాధ్యక్షుడు గిరిబాబు, అసరా సేవా సంస్థ సభ్యులు ఓబులేష్, ఆర్.రాజన్న, సుబ్రహ్మణ్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● పలమనేరు: పలమనేరులోని టవర్‌క్లాక్ వద్ద శుక్రవారం జ్యోతిరావు పూలే వర్ధంతిని బీసీ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి, బీసీ ఫ్రంట్ నాయకులు అద్దంకి రమణమూర్తి, గోవిందస్వామి, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

● శాఖాగ్రంథాలయం వద్ద : పలమనేరు శాఖా గ్రంథాలయం వద్ద బీసీ ఉద్యోగ సంఘ నాయకులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూజలు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీసీ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్, నాయకులు హేమంత్‌కుమార్, వీబీ బాలసుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్‌యాదవ్, నయీమ్‌బాషా, సుభాష్, మహేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

●పుంగనూరు: అణగారినవర్గాల అభ్యున్నతి కోసం సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం మహోన్నత పోరాటం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని.. ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఇందిరా సర్కిల్‌లోని ఆయన వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. బీసీసంక్షేమ సంఘ నాయకులు కృష్ణమూర్తి, ఎస్‌ఐ వెంకటరమణ, అద్దాల నాగరాజ, జగదీశ్‌రాజు, అయూబ్‌ఖాన్, నాయకులు బి.నరసింహులు, డిష్ రాజారెడ్డి, నానబాల కుమార్, రాజాశెట్టి, పెద్దమఠంబాబు, మల్లిఖారాణి, ప్రిన్సిపాల్ గంగాధర్‌నాయుడు, రాజశేఖర్, లెక్చరర్ హరిబాబు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఓబీసీ విద్యార్థి సంఘ నాయకులు సురేశ్ యాదవ్, వెంకట్‌యాదవ్, మున్నా, సునీల్‌యాదవ్,లోకేశ్, ప్రభు, రాకేశ్ తదితర నాయకులు పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

● సదుం: సదుంలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో మాజీ ఎంపీపీ వెంకటస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జయసింహ నాయుడు, ఉపాధ్యాయులు, దళిత సంఘ నాయకులు వెంకటరమణ, మల్లెపల్లి శ్రీనివాసులు, సీతాపతి, బండి చంద్ర, గిరిబాబు, ఆనంద మండడి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

డ్వాక్రాలో కొత్త యాప్‌తో మోసాలకు చెక్



యాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డ్వాక్రా సంఘ మహిళలు

పాలసముద్రం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల ఆర్థిక లావాదేవిలు సక్రమంగా నిర్వహించడానికి వీలుగా ప్రభుత్వం మన డబ్బులు-మన లెక్కలు అనే యాప్‌ను రూపొందించిందని ఏపీఎం కల్పలతారెడ్డి తెలిపారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘాల లీడర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యాప్ వలన సంఘాల్లో మోసాలకు తావు లేకుండా లెక్కలను పక్కాగా నిర్వహించ వచ్చునన్నారు. యాప్ గురించి సంఘంలో ఉండే ప్రతి మహిళకు తెలియజేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీసీలు మురగయ్య చిరంజీవి, డ్వాక్రా సంఘ లీడర్లు పాల్గొన్నారు.

ఇళ్ల దరఖాస్తుల గడువు పెంచండి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల దరఖాస్తుల గడువును పెంచాలని కోరుతూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ మేరకు శుక్రవారం హౌసింగ్ పీడీ సుబ్రమణ్యాన్ని కలిసి వినతి పత్రం సమర్పించారు. పీఎం ఆవాస్ యోజన కింద ప్రతి ఒక్కరికి ఇళ్లు అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపుతున్నా, అర్హులను గుర్తింపులో జాప్యం జరుగుతోందన్నారు. ఈనెల 30న గడువు ముగిస్తే చాలా మంది పేదలు అర్హత కోల్పోతారన్నారు. లబ్దిదారుల్ని గుర్తించేందుకు కాలపరిమితి గడువు పెంచాలని పీడీని కోరారు.

తహసీల్దారుకు టీడీపీ నేతల సత్కారం



చిత్తూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కల్యాణిని మండల టీడీపీ నాయకులు సన్మానించారు. శుక్రవారం చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమెను వీరు మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, మండల అధ్యక్షుడు రఘు, నాయకులు మోషాక్, శశికర్‌బాబు, శ్యామ్, కాటమరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ రాంమ్మోహన్

గుడిపాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాయ మాటలు చెప్పె వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని గుడిపాల ఎస్‌ఐ రాంమ్మోహన్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌ను ఎవరూ వినియోగించరాదన్నారు. భవిష్యత్‌ను,జీవితాన్ని పాడుచేసుకోవద్దని హితవు పలికారు. డ్రగ్స్‌తో ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న రెడ్డెప్ప

ఐరాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ రెడ్డెప్ప శుక్రవారం ఆయన నాగమవాండ్లపల్లె, గోవిందరెడ్డిపల్లెలో సబ్ హెల్త్ సెంటర్లను పరిశీలించారు. అక్కడి పాఠశాలలకు కూడా వెళ్లారు. పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లో ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా బీపీ, షుగర్, క్యాన్సర్ బాధితులను పరీక్షించారు. సూపర్‌వైజర్ చిన్నమ్మ, మునిరత్నం, ఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎంలు భువనేశ్వరి, భార్గవి పాల్గొన్నారు.

ప్రజలతో సామరస్యంగా మెలగాలి



సిబ్బందితో మాట్లాడుతున్న రవికుమార్

పెనుమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలతో వచ్చే ప్రజలతో సామరస్యంగా మెలగాలని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు సచివాలయ సిబ్బందికి సూచించారు. వారి సమస్యను సావధానంగా విని పరిష్కరించాలన్నారు. శుక్రవారం ఆయన శాతంబాకం సచివాలయాన్ని పరిశీలించారు. హాజరు, కదలికల రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది సకాలంలో హాజరుకావాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సెక్రటరీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్...



మెయిన్ సెంటర్లకు ప్రమోట్ అయిన అంగన్‌వాడీలు

పెనుమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మి ని అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీల స్థాయికి పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అంగన్‌వాడీ సిబ్బంది సంఘం నేతల ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఏగునుకొండయ్యపల్లి అంగన్‌వాడీ సెంటర్ వద్ద ఫోరం ఫర్ అంగన్‌వాడీ వర్కర్ హెల్పర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శైలజ, సూర్‌వైజర్ రెడ్డి కల్యాణి నిర్వహించిన మీటింగ్‌లో మండలంలో మిని నుంచి మెయిన్ సెంటర్‌గా ప్రమోట్ అయిన కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ నిర్ణయంతో వేతనం రూ.7 వేల నుంచి రూ.11500కి పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోవిందమ్మ, హంసవేణి, సబానా, జయంతి, రాజేశ్వరి, లోకేశ్వరి, పవనకుమారి, చంద్రమ్మ, రజని పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారాన్ని పెంచుకోండి



రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

నింద్ర, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అగరం, కొప్పేడు, నింద్ర గ్రామాల్లో రైతన్నా శుక్రవారం మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఏ.రామకృష్ణారావు, మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లి పెసర, అలసంద వంటి పచ్చిరొట్ట పంటలను సాగుకు ముందు వేసుకుని 30 రోజులు తరువాత భూమిలో కలియదున్ని సాగు చేసుకున్నట్లయితే భూమి సారవంతమవుతుందన్నారు. దిగుబడి పెరుగుతుందన్నారు. ఎరువుల వినియోగంపై సూచనలు చేశారు. వ్యవసాయ పరిశోధన స్థానం, పెరుమాళపల్లి శాస్త్రవేత్తలు ఎస్.వి.సరళ, బి.వజంత, మండల వ్యవసాయ అధికారి కె.తులసిరామ్, పశు వైద్య అధికారులు సాయిసౌందర్య, వరప్రసాద్,వీఏఏ సుధాకర్‌లు పాల్గొన్నారు.

1న ఫర్నిచర్ వేలానికి బహిరంగ వేలం

చిత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్, అడ్మిన్ కార్యాలయంలోని ఫర్నీచర్,ఎలక్ట్రికల్, కంప్యూటర్ పరికరాలకు వచ్చే నెల 1న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఏఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పాత ప్రశాంత్‌నగర్‌లోని జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు ఏ సెక్షన్ సూపరింటెండెంట్ పుష్పరాజ్‌ను సంప్రదించాలని సూచించారు.

మోటార్ సైకిల్ చోరీ

విజయపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గొల్లకండ్రిగ దళివాడకు చెందిన మహేంద్రన్ తన మోటార్ సైకిల్ చోరీకి గురైందని నగరి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నగరి ఏరియా ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ చేసి ఆస్పత్రిలో చికిత్స పొందగా దుండగుడు మోటారు సైకిల్ తీసుకుపోయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మదనపల్లెను అబ్దుల్ కలాం జిల్లాగా ప్రకటించాలి



నినదిస్తున్న నాయకులు

పుంగనూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటు కానున్న మదనపల్లె జిల్లాకు ఏపీజే అబ్దుల్ కలాం పేరు పెట్టాలని పుంగనూరు అబ్దుల్ కలాం హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి.అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మినీ బైపాస్‌రోడ్డులోని అబ్దుల్‌కలాం సర్కిల్‌లో ఆయన మాట్లాడుతూ మదనపల్లె జిల్లాకు పేరు మార్పు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ఏర్పాటుకు సహకరించిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి.నరసింహులు, నాగరాజ, నానబాల కుమార్, రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ కృపాకర్ పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ ఆకస్మిక మృతి

చిత్తూరు కల్చరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): స్థానిక పొన్నియమ్మగుడి వీధిలోని వీరాంజనేయస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ డి.యతిరాజులు(62) మృతి చెందారు. శుక్రవారం ఆయన బజారువీధిలో ద్విచక్రవాహనంపై వస్తుండగా కుప్పకూలి రోడ్డుపై పడిపోయారు. పరిసర ప్రజలు గమనించిఆస్పత్రికి తరలించేలోపే తుదిశ్వాస విడిచారు. సంతాపసూచకంగా ఆలయాన్ని మూసివేశారు. ఆయన భౌతిక కాయానికి ఆలయ ఈవో వెంకటరాయులు, అర్చకులు సుధాకర్ గురుకుల్, సిబ్బంది నివాళులు అర్పించారు.

వరసిద్ధుని సేవలో మాజీ ఎమ్మెల్యే వర్మ

ఐరాల(కాణిపాకం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే .వర్మ శుక్రవారం సాయంత్రం కాణిపాక వరసిద్ధుడ్ని దర్శించుకున్నారు. ఏ ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి ఆయనకు స్వామి దర్శనం చేయించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు,జ్ఞాపికను అందించారు.

డిగ్రీ కాలేజీలో ఫ్రెషర్స్ డే



సమావేశంలో మాట్లాడుతున్న అన్నపూర్ణశారద

వెదురుకుప్పం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమం జరిగింది. మొదటి సంవత్సర విద్యార్థులను స్వాగతిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల నిబంధనలు, పరిస్థితులను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ .అన్నపూర్ణ శారద వివరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

28జీడీఎన్ ఆర్ జీడీఎన్ 9:

మురుగేషన్

గంగాధరనెల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా కుప్పిగానిపల్లె మురుగేషన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన తవణంపల్లె మండలం అరగొండ పంచాయతీకి కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై వచ్చారు. ఈయన మండంలోని 25 సచివాలయాలను పర్యవేక్షిస్తారు. ఇప్పటికే ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న శివయ్య 32 పంచాయతీలను పర్యవేక్షిస్తారు.

తిరువణ్ణామలైకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పలమనేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు డిపో నుంచి రానున్న డిసెంబరు 3న కార్తీక దీపం, డిసెంబరు 4న పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. 3న మధ్యాహ్నం పలమనేరులో 2 గంటలకు బయలుదేరి తిరువణ్ణామలైకు రాత్రి 8 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి అక్కడ ఉదయం 2 గంటలకు బయలు దేరి పలమనేరుకు 6 గంటలకు చేరుతుందన్నారు. డిసెంబరు 4న ఉదయం 11 గంటలకు, 11.15 గంటలకు రెండు బస్సులు పలమనేరు నుంచి తిరువణ్ణామలైకు బయలు దేరి అదేరోజు తిరువణ్ణామలైకు మధ్యాహ్నం 3గంటలకు చేరుకుంటాయన్నారు.

పీహెచ్‌సీల్లో అసంపూర్తి పనుల మాటేమిటి?



తూగుండ్రం పీహెచ్‌సీ భవనం

గంగాధరనెల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు, తూగుండ్రం పీహెచ్‌సీభవనాలు బయటకు బాగానే ఉన్నా లోపల కొన్ని పనులను అసంపూర్తిగా వదిలేశారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు ఈ రెండు కేంద్రాలకు భవనాలను నిర్మించారు. మోల్డింగ్‌పై భాగంలో, కిటికీలు, డోర్లు, ఐరన్‌గేట్లు ఏర్పాటు చేయలేదు. ఫ్లోరింగ్, గోడల టైల్స్, పెయింటింగ్, విద్యుత్ వైరింగ్ పనులు 80శాతం వరకు పూర్తి చేశారు. మిగిలిన పనులు చేపట్టలేదు. తూగుండ్రం పీహెచ్‌సీ ఆపరేషన్ థియేటర్‌లో గ్లాస్ డోర్స్ బిగించకుండా వదిలేశారు. ల్యాబ్ టెక్నిషియన్ గదిలో పరికరాలు, మందులు, పెట్టడానికి ర్యాక్‌లు అమర్చలేదు. గంగాధరనెల్లూరు భవనంలో మోల్డింగ్ పైభాగంలో సిమెంట్ వేసినా వర్షం కురిసినపుడు కొన్ని గదుల్లో ఉరుస్తోంది. ప్లంబింగ్, వెస్ట్రన్ టాయిలెట్ పనులూ అంతంత మాత్రంగా చేశారు. పల్లపు ప్రాంతాల్లో నీటి నిల్వ లేకుండా మట్టితోలి ఎత్తుపెంచాల్సి ఉంది. డాక్టర్‌తో పాటు సిబ్బంది క్వార్టర్స్ భవనాలు సైతం శిథిలస్థితికి చేరుకున్నాయి. పెండింగ్ పనుల పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేలు అర్జీల స్వీకారం





అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యేలు మురళీ మోహన్- గురుజాల జగన్మోహన్

తవణంపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మురళీ మోహన్ అధికారులతో కలిసి ప్రజా దర్బార్ నిర్వహించారు. పలు గ్రామాల నుంచి 71 మంది వివిధ సమస్యలపై ఆయనకు అర్జీలు అందజేశారు. పలు సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కరించారు. జిల్లా స్థాయిలో పరిష్కారించాల్సిన సమస్యలను పది రోజుల్లో అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. అనంతరం తవణంపల్లెలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, ఏవో ప్రవీణ్, అధికారులతో మపాటు మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, ఏఎంసీ చైర్మన్ భాస్కర్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు సిటీ : స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. 84 వినతులు అందాయి. పింఛన్లు, కాలనీల్లో మౌళిక సదుపాయాలు, భూ సమస్యలు, ఇంటి పట్టాలు, ఇళ్లు, ఉపాధి అవకాశాల కోసం ఎక్కువ వినతులు వచ్చాయి. కొన్నింటిపై ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మిగిలిన వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ అముద, ఎంఈ వెంకటరామిరెడ్డి, రూరల్ తహసీల్దారు కల్యాణి, ఎంపీడీవో శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు నేతల నివాళి



జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావు పూలే సందర్భంగా పీసీఆర్ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, బీసీసంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి షణ్ముగం, మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మేయర్ అముద, బీజేపీ నేతలు చిట్టిబాబు, అట్లూరి శ్రీనివాసులు తదితరులు నివాళులు అర్పించారు. బీజేపీ నేతలు చిట్టిబాబు, అట్లూరి శ్రీనివాసులు, సత్యనారాయణరెడ్డి, బీసీ సంక్షేమాధికారి రబ్బాని బాషా తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. **చిత్తూరు సిటీ:** మహాత్మ జ్యోతిరావు పూలేకు టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, కోదండ యాదవ్, సురేంద్ర కుమార్, మోహన్‌రాజ్‌పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నగరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వేలావడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పంటలను సంబంధిత విభాగానికి చెందిన ఆర్‌వైఎస్ఎస్ అధికారి నీరజ(గుంటూరు), జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసులు శుక్రవారం పరిశీలించారు. రామకృష్ణ అనే రైతు పొలంలో సీడ్‌టు సీడ్ ఆయిల్ ఫామ్ తోటలో 30 రకాలతో వేసిన నవధాన్యాల పంటను చూశారు. భూమిలో వానపాములు అధికంగా ఉండడం రైతును ప్రశంసించారు.బుగ్గ అగ్రహారంలో జయచంద్రారెడ్డి పొలంలో నీటి పొదుపుపై ఆరా తీశారు. టీవీ కండ్రిగలో మోడల్ మేకర్ సురేష్ సిద్ధం చేసిన ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ ఫ్రూట్స్ మోడల్, శాశ్వత జీవామృతం తొట్టెను పరిశీలించారు. మరికొన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్, ప్రకృతి వ్యవసాయం ఎన్ఎఫ్ఎం నాంచారమ్మ, సురేష్, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


ఆర్టీఐ అసోసియేషన్ ఐదో వార్షికోత్సవం





కేక్‌కట్‌చేస్తున్న ఎంపీడీవో మనోహర్‌గౌడ్,ఆర్టీఐ అసోసియేషన్ నాయకులు

గంగాధరనెల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాచారహక్కు చట్టం(ఆర్టీఐ)తో సామాన్యులకు ప్రభుత్వఆఫీసుల్లో వివరాల సేకరణకు మార్గం సుగమమైందని ఎంపీడీవో శేషగాని మనోహర్‌గౌడ్ అన్నారు. జాతీయ సమాచార హక్కుచట్టం అసోసియేషన్ ఏర్పాటై ఐదేళ్ళు పూర్తియిన సందర్భంగా శుక్రవారం ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో యూనియన్ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.కె.కుమార్, సలహాదారు డాక్టర్ తిలక్‌లతో కలిసి ఎంపీడీవో కేక్ కట్‌చేశారు. ఐదేళ్లుగా ఈ యూనియన్ సమాచారం హక్కు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు,అధికారులు పాల్గొన్నారు.

రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యం







రామభద్రాపురం- కొల్లాగుంటలో రైతన్నా మీ కోసంలో కరపత్రాలను చూపుతున్న నాయకులు

గుడిసాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు అన్నారు. శుక్రవారం రామభద్రాపురం పంచాయతీలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పచ్ పళణి తదితరులు పాల్గొన్నారు. **పెనుమూరు:** చిప్పారపల్లి పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మెన్ క్రిష్ణమనాయుడు పాల్గొని రైతులతో మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రయ్యానాయుడు, తలారిరెడ్డెప్ప, ఏవో సుహర్‌లత, భాస్కర్, డైరెక్టర్‌లు ఎన్ఎస్‌నాయుడు తదితరులుపాల్గొన్నారు.**విజయపురం:** కృష్ణసముద్రంలో టీడీపీ నాయకులు శుక్రవారం రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ యేడాది రైతులకు ప్రభుత్వం ద్వారా అందిన రైతు భరోసా వివరాలను తెలిపి కరపత్రాలు పంపిణీ చేశారు.వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో సీఎం చంద్రబాబు రాసిన లేఖలను రైతులకు టీడీపీ నాయకులు అందజేశారు. మండల పార్టీ ప్రధానకార్యదర్శి వడింగాడు రాజా, మాదిరాజు జనార్దనరాజు, మేలపూడి రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** తగ్గువారిపల్లె పంచాయతీలో జరిగిన రైతన్నా... మీకోసం కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్ పాల్గొన్నారు. నాయకులతో కలిసి ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌గౌడ్, లోకనాథనాయుడు, హేమచంద్రనాయుడుపాల్గొన్నారు.

చెత్త సేకరణ పరిశీలన

పెనుమూరు, వనంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో విధిగా చెత్త సేకరించాలని డీఎల్‌డీవో రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఐవీఆర్ఎస్ పంచాయతీ అయిన శాతంబాకంలో చెత్త సేకరణ తీరును ఆయన పరిశీలించారు. తడిపొడి చెత్తను వేరువేరుగా సేకరించి ఎరువులు తయారు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ



డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎంవీఐలు

చిత్తూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయం విద్యాసంస్థల్లో స్కూల్ బస్సుల నిర్వహణపై రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక విజయం విద్యాసంస్థల బస్సులను ఎంవీఐలు తనిఖీ చేశారు. బస్సుల రికార్డులను, ఎమర్జెన్సీ డోర్, ఫైర్ సేఫ్టీ అలారమ్స్, బస్సుల కండీషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యాజమాన్య సిబ్బందికి, డ్రైవర్లకు, విద్యార్థులకు రోడ్ సేఫ్టీపై తగు సూచనలు చేశారు. ఎంవీఐలు రాజేశ్వరరావు, మురళి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ద్రౌపది అమ్మవారికి విశేష పూజలు



వెదురుకుప్పం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపది ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మేళం రవియాదవ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోగులకు ఉచిత వైద్య సేవలు




రోగులకు వైద్యసేవలందిస్తున్న వైద్యులు

బంగారుపాళ్యం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనిజింగ్ ట్రస్టీ ఆధ్వర్యంలోని ఆరోగ్య రథం శుక్రవారం బంగారుపాళ్యం చేరుకుంది. ఇక్కడి రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. 50 మందికి మందులను అందజేశారు. ప్రతి నెలా మండల పరిధిలోని ఏదో ఒక గ్రామపంచాయతీని ఎంపిక చేసి శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. సేవలందించిన వారిలో డాక్టర్ మధు,వైద్య సిబ్బంది ఝాన్సీ రాణి,శ్రావంతి,బాలగణేషలు ఉన్నారు

మినీ వ్యాను బోల్తా

వెదురుకుప్పం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి మినీ వ్యాను బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం బెంగళూరు నుంచి శ్రీసిటీ వస్తున్న మినీవ్యాను కార్వేటినగరం మండలం అల్లాగుంట వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

కాలం చెల్లిన చిక్కీల పంపిణీ



పుంగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన చిక్కీలను విద్యార్థులకు పంపిణీ చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పుంగనూరు మండలం వనమలదిన్నె జడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలకు భోజనం తర్వాత పౌష్టికాహారం కింద కాలం చెల్లిన బెల్లం చెక్కీలు పంపిణీ చేశారు. కాగా చెక్కీలు ఈఏడాది అక్టోబరు 31వ తేదీకి కాలం చెల్లుతాయని తయారీదారులు ప్యాకెట్‌లో పొందుపరిచారు. ఇది గమనించిన విద్యార్థులు వాటిని తినకుండా ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులకు చూపడంతో ఆందోళనలో పడ్డారు. కాలం చెల్లిన పౌష్టికాహారాన్ని తిని పిల్లలు అస్వస్థతకు గురైతే పరిస్థితి ఏంటని ఉపాధ్యాయులపై మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలం చెల్లిన ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.